www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
26 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 230

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




## మూసీకి స్పీడ్ పెంచండి

- మూసీ భూసేకరణ వేగవంతం
- ల్యాండ్ పూలింగ్‌కు స్పష్టమైన విధానం
- ఫేజ్-2 టెండర్లకు సీఎం ఆదేశం
- తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి
- ఓంకారేశ్వరస్వామి ఆలయానికి టెండర్లు
- బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ల్యాండ్ పూలింగ్‌లో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా స్పష్టమైన విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూముల సేకరణకు ప్రత్యేక మార్గదర్శకాలు సిద్ధం చేయాలని సూచించారు. న్యాయపరమైన వివాదాలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మూసీ ఫేజ్2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టు అమలులో జాప్యం లేకుండా విభాగాల మధ్య సమన్వయం పెంచాలని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా భూసేకరణ విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. బాధితులకు నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాస చర్యలు బాగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మూసీ అభివృద్ధి లక్ష్యాలు నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తయ్యేలా ప్రతి దశపై పర్యవేక్షణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు భూసేకరణకు సంబంధించిన ఫైళ్లను వేగంగా పరిష్కరించి, క్షేత్రస్థాయిలో అధికారులు నిత్యం పర్యటించాలని సీఎం ఆదేశించారు. ప్రాజెక్టులకు ఆర్థిక వనరుల సమీకరణపైనా

మిగతా 2లో..



### మా అమ్మను టార్చర్ పెట్టాడు.. నాన్నను చంపేశాడు!

- చిన్నారి రియాన్ష్ సంచలన ఆరోపణలు
- కోచ్ సాదిక్ ఖాన్‌పై రియాన్ష్ ఆవేదన భరిత వ్యాఖ్యలు
- తన తల్లిదండ్రుల ప్రాణాలు తీసిన రాక్షసుడిని వదలొద్దని ఆవేదన

03

## పూడిక తీయకుండానే బిల్లులా?

- నాలాల పూడికతీతపై సంచలన ఆరోపణలు
- ఎమ్మెల్యేల ఫిర్యాదులతో విజిలెన్స్ విచారణ
- పూడిక తీయకుండానే బిల్లులా?
- వాహనాల నంబర్లపైనా అనుమానాలు
- 14 ఏళ్ల క్రితం కూడా ఇదే తరహా ఆరోపణలు
- కాంట్రాక్టర్లతో పాటు అధికారుల పాత్రపై దృష్టి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్‌లో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఏటా కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. నాలాల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, జవహర్‌నగర్‌కు తరలించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. అయితే పనుల నాణ్యతపై ఇప్పుడు తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పూడిక తీయకుండానే తీసినట్లు

మిగతా 3లో..

## గురుకులంలో ఘోరం!

- చపాతీలు చేస్తున్న విద్యార్థుల వీడియో వైరల్
- ఉపాధ్యాయుల తీరుపై తీవ్ర విమర్శలు
- ప్రిన్సిపాల్ పర్యవేక్షణపై ప్రశ్నలు
- విచారణకు విద్యార్థి సంఘాల డిమాండ్
- బాధ్యులపై చర్యలకు తల్లిదండ్రుల పట్టుబాటు

03

**గురుకులంలో విద్యార్థులతో వంట పనులు**



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదు!

- రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలు
- వేలాది కళాశాలలకు ఆర్థిక సంక్షోభం
- 40 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం
- సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల అవస్థలు
- రేవంత్ హామీలపై బండి సంజయ్ ప్రశ్నలు
- రామచంద్రరావు దీక్షకు సంపూర్ణ మద్దతు

03





# కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు?

- కొండా సురేఖపై వేటుకు సిఫారసు?
- చిన్నారెడ్డిపై చర్యకు కమిటీ మొగ్గు
- సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై వివాదం
- మేఘారెడ్డి ఫిర్యాదుతో కొత్త మలుపు
- హైకమాండ్ చేతుల్లో తుది నిర్ణయం
- సురేఖ అధిష్ఠానం వైఖరిపై ఉత్కంఠ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కత్తి వేలాడుతోంది. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డిపై వేటుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించినట్లు తెలిసింది. కమిటీ చైర్మన్ మల్లు రవి, వైస్ చైర్మన్ ఎ. శ్యామ్ మోహన్ నేతల వివరణలు, వీడియో ఆధారాలను పరిశీలించి నివేదిక రూపొందించారు. దీనిని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్ గౌడ్‌కు అందజేశారు. తదుపరి నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోకి వెళ్లింది. దీంతో ఇద్దరు సీనియర్ నేతల రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై నాయకత్వం కఠినంగా వ్యవహరించబోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

మిగతా 2లో..




### నాగోల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎప్పుడు?

- అనుమతులు లేకుండానే నిర్మాణాల జోరు
- టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం
- ఫిర్యాదులు చేసినా చర్యలు లేవంటూ ఆరోపణలు
- క్షేత్రస్థాయి తనిఖీలకు ప్రజల డిమాండ్

07




### అమిత్ షా బర్తరఫ్ చేయాల్సిందే!

- తుక్కుగూడలో యువజన కాంగ్రెస్ గర్జన
- నీట్ విద్యార్థులపై కాల్పులకు నిరసనగా భారీ ఆందోళన – దిష్టిబొమ్మ దహనం
- ప్రధాని మోదీ తక్షణమే స్పందించాలి : యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి

08

## డిసెంబరులో మున్సిపల్ పోరు!



- డిసెంబరులో రెండో దశ మున్సిపల్ ఎన్నికలు?
- హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరిపై ఫోకస్
- అక్టోబర్ 19 తర్వాత నోటిఫికేషన్?
- పెండింగ్ పురపాలక సంస్థలపై కసరత్తు
- ఎస్ఐఆర్ పూర్తయ్యాక ఎన్నికల వేగం
- స్థానిక రాజకీయాల్లో పెరగనున్న వేడి

02



## నల్గొండ ఫార్మా పరిశ్రమల్లో భద్రత ఏది?

- మూడేళ్లలో 14 మంది మృతి.. 36 మందికి తీవ్ర గాయాలు
- వరుసగా రియాక్టర్ పేలుళ్లు.. భద్రతా తనిఖీలపై ప్రశ్నలు
- కాంట్రాక్ట్ కార్మికుల భద్రత గాలికి... ప్రత్యేక భద్రతా ఆడిట్‌కు డిమాండ్

02

## ఏ1 రేవంత్‌రెడ్డి, ఏ2 పొంగులేటి!

- 22ఏపై హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు
- రేవంత్‌రెడ్డిపై ఏ1 వ్యాఖ్యలు
- పొంగులేటిని బర్తరఫ్ చేయాలని డిమాండ్
- 98 శాతం తొలగింపు వాదనపై విమర్శ
- సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- సెప్టెంబర్ 7న అసెంబ్లీలో పోరాటం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** 22ఏ నిషేధిత జాబితా వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ1, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏ2గా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్

మిగతా 3లో..





### పట్నాలో భగ్గుమన్న విద్యార్థి లోకం

- సీఎం నివాసం ముట్టడికి యత్నం, పోలీసుల లాఠీచార్జ్
- బీపీఎస్‌సీ పరీక్ష రద్దు చేయాల్సిందేనని విద్యార్థుల డిమాండ్
- గార్డనిబాగ్ నుంచి సీఎం నివాసానికి వందలాది మంది అభ్యర్థుల ర్యాలీ.. ఉద్రిక్తత

02



## పట్నాలో భగ్గుమన్న విద్యార్థి లోకం

**విశాలభారతి, పట్నా, :** కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్న బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసిన అభ్యర్థులు, వందల మంది విద్యార్థులు మంగళవారం పట్నాలోని బిహార్ రాష్ట్ర సీఎం సమ్రాట్ చౌధరి నివాసం వైపు ర్యాలీ తీశారు. అడ్డుగా ఉన్న బారికేడ్లను దాటారు. ఈ సందర్భంగా 70వ బీపీఎస్‌సీ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థులను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జీ చేశారు. వాటర్ క్యానన్లను ప్రయోగించారు. అయినప్పటికీ వారు సీఎం నివాస సమీపానికి చేరుకున్నారు. భూ సంబంధిత సమస్యలపై రైతు సంఘం నల్ల జెండాలు పట్టుకుని ఈ ఆందోళనలో చేరడంతో సీఆర్‌పీఎఫ్ బలగాలు మోహరించాయి. బీపీఎస్‌సీటీఆర్‌ఈ 4 ఒకే పరీక్ష, ఉద్యోగ నియమకాల్లో పారదర్శకత, హిందీ మీడియం విద్యార్థులకు బిహార్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల్లో సమాన అవకాశాలు కల్పించడం వంటి డిమాండ్లతో విద్యార్థులు, అభ్యర్థులు కొన్ని రోజులుగా పట్నాలోని గార్దనిబాగ్‌లో ఆందోళన చేపడుతున్నారు. బిహార్ ప్రభుత్వంతో విద్యార్థి ప్రతినిధులు చర్చలు జరిపారు. చర్చలు సానుకూలంగా జరిగాయని విద్యార్థి నాయకుడు సౌరవ్ కుమార్ చెప్పినప్పటికీ తమ అన్ని డిమాండ్ల సాధన కోసం ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు, అభ్యర్థులు నిర్ణయించుకున్నారు. దీంతో సీఎం నివాసం వైపు ర్యాలీ తీయగా పోలీసులు, వారికి మధ్య ఘర్షణ నెలకొంది. కింది స్థాయి అధికారులతో చర్చలు జరిపించి తరువాత మా సమస్యను మరిచిపోతున్నారు. కాబట్టి బిహార్ సీఎం లేదా డిప్యూటీ సీఎంతో చర్చలకు అవకాశం కల్పించి, సమస్యలపై అధికార ప్రకటన చేస్తేనే మా నిరసన విరమిస్తామని విద్యార్థి నాయకుడు ఒకరు వెల్లడించారు. సీఎంను కలిసేందుకు అనుమతించాలన్నదే మా ప్రధాన డిమాడ్, విద్యాశాఖ మంత్రి కలిసే అవకాశం కల్పించడం అనేది రెండో ప్రత్యామ్నాయం. అంతే తప్ప ఇంకెవ్వరినీ కలవం అని ఆ విద్యార్థి నాయకుడు స్పష్టం చేశారు. దీనిపై సీఎం సమ్రాట్ చౌధరి స్పందించారు. విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకెళ్లేలా ప్రతి నెలా నాలుగో మంగళవారం విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తామని అన్నారు. నేటి నుంచి ప్రభుత్వం 'విద్యార్థి సహ్యోగ్ శిబిరం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని సీఎం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అదేవిధంగా ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చవని, ప్రత్యేక పోర్ట్, హెల్ప్ లైన్ నంబర్ 1100 ద్వారా వాటి స్థితిని తెలుసుకోవచ్చని వెల్లడించారు.

# డిసెంబరులో మున్సిపల్ పోరు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు మొదలైనట్లు సమాచారం. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లతో పాటు గతంలో ఎన్నికలు వాయిదా పడిన పురపాలక సంస్థలకు డిసెంబరులో ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పురపాలక శాఖ అధికారులు ప్రాథమిక ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ అక్టోబర్ 19 నాటికి పూర్తయ్యే అవకాశముంది. ఆ ప్రక్రియ ముగిసిన తర్వాత కొంత వ్యవధి తీసుకుని ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే అవకాశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల పాలక మండళ్లకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎన్నికల షెడ్యూల్‌పై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశం కనిపిస్తోంది. అధికార పార్టీతో పాటు విపక్షాలు కూడా అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకున్న తర్వాత అధికారిక షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. అయితే అప్పటికి జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల పాలక మండళ్ల పదవీకాలం పూర్తికాలేదు. దీంతో ఆ సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఇదే సమయంలో మందమర్రి, మణుగూరు, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగలేదు. మిగిలిన పురపాలక సంస్థల ఎన్నికలు పూర్తవడంతో ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఆయా ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన వార్డుల వివరాలు, ఓటర్ల జాబితాలు,



సిబ్బంది కేటాయింపు, పోలింగ్ కేంద్రాలపై అధికారులు సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన మౌలిక ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. స్థానిక రాజకీయ పరిస్థితులు, గత ఫలితాలు, ఓటర్ల మార్పులు, సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల బలాబలాలు కీలకం. గ్రేటర్ పరిధిలో వార్డు ప్రాధాన్యం సంతరించుకోనుంది. అధికార పార్టీ పనితీరును ప్రచారాస్త్రంగా మార్చుకునే అవకాశం ఉంది. జీహెచ్ఎంసీని సీఎంసీ, జీహెచ్ఎంసీ, ఎంఎంసీగా విభజించిన నేపథ్యంలో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. విభజన తర్వాత కొత్త పాలనా నిర్మాణానికి అనుగుణంగా ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆయా సంస్థలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. సాధారణంగా పాలక మండళ్ల కాలపరిమితి ముగిసిన ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే మున్సిపాలిటీల పునర్వ్యవస్థీకరణ, వార్డుల మార్పులు, పరిపాలనా ప్రక్రియల కారణంగా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఏర్పడింది. ఇప్పుడు ఆ ప్రక్రియను ముగించి ప్రజాప్రతినిధుల పాలనకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. కొత్త సరిహద్దులు, వార్డుల కూర్పు, రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన తర్వాత ఎన్నికల ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది. దీంతో ఆశావహులు తమ రాజకీయ కదలికలను ఇప్పటి నుంచే ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలు కూడా స్థానిక బలాబలాలను అంచనా వేస్తున్నాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చట్టపరమైన ప్రక్రియలను అధికారులు కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ అధికార యంత్రాంగానికి ప్రధాన ప్రాధాన్యంగా మారింది. ఓటర్ల జాబితా సవరణ, వివరాల పరిశీలన, అర్హత ఉన్న ఓటర్ల నమోదు వంటి అంశాలపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. అక్టోబర్ 19 నాటికి ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉన్నందున, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు మరింత వేగం పుంజుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఎస్ఐఆర్ పూర్తయిన వెంటనే ఎన్నికల నిర్వహణకు అవసరమైన తదుపరి చర్యలను చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాల తుది రూపం, వార్డుల వివరాలు, రిజర్వేషన్ల అంశాలు కీలకంగా మారనున్నాయి. వీటిపై స్పష్టత వచ్చిన తర్వాత నోటిఫికేషన్‌కు మార్గం సుగమం కానుంది. ప్రభుత్వం డిసెంబరును లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రచారం సాగుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో కూడా కదలికలు పెరిగే అవకాశం ఉంది. అభ్యర్థుల ఎంపిక, స్థానిక పొత్తులు, ప్రచార వ్యూహాలపై చర్చలు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి. ఓటర్ల జాబితా వెలువడిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో అడుగు పడనుంది. ఆ తర్వాత ఏర్పాట్లను పూర్తి చేసే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే డిసెంబరులో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన కార్యరూపం దాల్చితే రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక దశ మొదలుకానుంది. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలోని స్థానిక రాజకీయాలు రాష్ట్రవ్యాప్త దృష్టిని ఆకర్షించే అవకాశముంది. పెండింగ్‌లో ఉన్న పురపాలక సంస్థల్లో కూడా పార్టీలు తమ బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఎన్నికల తేదీలపై అధికారిక ప్రకటన వచ్చే వరకు అనిశ్చితి కొనసాగినా, అధికార యంత్రాంగం ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు వస్తున్న సమాచారం రాజకీయ వేడి పెంచుతోంది. ఎస్ఐఆర్ పూర్తయిన తర్వాత నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుంది, ఎన్నికలు ఏ దశలో జరుగుతాయి, రిజర్వేషన్లలో ఎలాంటి మార్పులు ఉంటాయి అన్నది ఆసక్తికరంగా మారింది. స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులు, అభ్యర్థుల వ్యక్తిగత బలం, పార్టీల సమన్వయం ఫలితాలను ప్రభావితం చేసే అంశాలుగా నిలవనున్నాయి. దీంతో డిసెంబరు పోరు కోసం అన్ని పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలు సిద్ధం చేసే అవకాశం ఉంది. స్థానిక సమస్యలు ఎన్నికల అజెండాగా మారే అవకాశం ఉంది. రహదారులు, పారిశుధ్యం, అంశాలు చర్చకు వస్తాయి.

# మూసీకి స్పీడ్ పెంచండి

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారు. తక్కువ వడ్డీకి లభించే రుణాలను గుర్తించి, వాటిని వినియోగించుకునేలా మున్సిపల్ కమిషనర్లు కసరత్తు చేయాలని సూచించారు. ఆర్థిక భారం తగ్గే మార్గాలను అన్వేషిస్తూ ప్రాజెక్టుల పురోగతికి నిధుల కొరత లేకుండా చూడాలని చెప్పారు. టీఆర్ఆర్ కాకుండా టీజీడీఆర్ ప్రక్రియపైనా ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, నిర్మాణ పనులు సమాంతరంగా సాగితే మూసీ ప్రాజెక్టు లక్ష్యాలను వేగంగా చేరుకోవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. అధికారులంతా బాధ్యతలు స్పష్టంగా పంచుకుని నిర్ణయాలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని చెప్పారు. రుణాల ఎంపికలో వడ్డీ రేటుతో పాటు తిరిగి చెల్లింపు కాలం, ప్రభావాన్ని పరిశీలించాలని సూచించారు. వ్యయ నియంత్రణకు పటిష్ఠమైన పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ప్రతి వారం పురోగతి నివేదికలను సమీక్షించి, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూసీ పనులకు నిధుల ప్రవాహం ఎల్లప్పుడూ ఉండేలా కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ఆ దిశగా ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. మూసీ పరివాహక ప్రాంతంలో పర్యాటక, ఆధ్యాత్మిక అభివృద్ధిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు వెంటనే టెండర్లు పిలవాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆలయ పరిసరాలను భక్తులకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దే పనులు వేగంగా ప్రారంభించాలని సూచించారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు చెప్పారు. నగరానికి సమీపంలో ఉన్న పర్యాటక ఆకర్షణలను ప్రజలకు విస్తృతంగా పరిచయం చేస్తే సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్కులు, ఆలయాలు, నదీ తీర ప్రాంతాల అభివృద్ధిని సమగ్ర ప్రణాళికతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మూసీ ప్రాజెక్టును కేవలం నది ప్రక్షాళనగా కాకుండా నగర పునర్వ్యవస్థీకరణకు కీలకమైన కార్యక్రమంగా చూడాలని సీఎం పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజా వినియోగం, పర్యాటకాభివృద్ధి అంశాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ



ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి నిర్మాణానికి సమయపాలన పాటిస్తూ ప్రజలకు కనిపించే మార్పులు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో మూసీ ప్రాజెక్టు పురోగతిపై ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చించారు. భూసేకరణ నుంచి టెండర్ల వరకు ప్రతి అంశాన్ని అధికారులు వివరించారు. పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారాలు చూపాలని సీఎం సూచించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధుల నిర్ధారణలో స్పష్టత ఉండాలని, అసైన్డ్ భూముల విషయంలో చట్టపరమైన నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పారు. ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన విధానం ప్రజలకు అర్థమయ్యేలా రూపొందించాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయం పెంచి నిర్ణయాలు వేగంగా తీసుకోవాలని ఆదేశించారు. మూసీ ఫేజ్ 2 టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి విభాగం తన పరిధిలోని పనులకు గడువులు నిర్ణయించుకోవాలని చెప్పారు. పురోగతిలో వెనుకబడిన అంశాలను తదుపరి సమీక్షలో తప్పనిసరిగా వివరించాలని సూచించారు. ప్రాజెక్టు అమలులో పారదర్శకత, నాణ్యత, వేగం మూడు ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. కీలక నిర్ణయాలకు ప్రత్యేక కాలపట్టిక రూపొందించాలని కోరారు. ఈ సమీక్షకు సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి హాజరయ్యారు. సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి.నరసింహారెడ్డి, జేఎండీ గౌతమి సహా పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. మూసీ ప్రాజెక్టు పనులకు శాఖలవారీగా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. భూసేకరణకు సంబంధించిన అంశాల్లో స్థానిక స్థాయిలో సమన్వయం పెంచాలని చెప్పారు. న్యాయపరమైన చిక్కులు ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. టెండర్లు, రుణాలు, టీఆర్ఆర్ సమీక్ష, పర్యాటక ప్రాజెక్టులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగాలని స్పష్టం చేశారు. నగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మూసీ అభివృద్ధి జరిగేలా అధికారులు సమగ్ర దృష్టితో పనిచేయాలని సూచించారు. సీఎం ఆదేశాలతో మూసీ పనుల్లో వేగం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూసేకరణ ప్రక్రియ కీలక దశకు చేరుకోగా, ఫేజ్ 2 టెండర్లపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## నల్గొండ ఫార్మా పరిశ్రమల్లో భద్రత ఏది?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెంట ఫార్మా పరిశ్రమలు భయానకంగా మారుతున్నాయి. రియాక్టర్ పేలుళ్లు, విషవాయు లీకేజీలు, ఫ్లాష్ ఫైర్లు వరుసగా చోటుచేసుకుంటుండటంతో కార్మిక కుటుంబాల్లో ఆందోళన పెరుగుతోంది. భువనగిరి, చౌటుప్పల్, పోచంపల్లి, చిట్యాల పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రమాదాల పరంపర ప్రశ్నలు రేపుతోంది. సాంకేతిక లోపాలతో పాటు భద్రతా తనిఖీల లోపం, పర్యవేక్షణ వైఫల్యం పరిస్థితిని విషమం చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉత్పత్తి లక్ష్యాలు, లాభాలపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా కార్మికుల భద్రతపై చూపాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం ప్రకటించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ప్రాణాలను కాపాడుతుందని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతి యూనిట్‌లో భద్రతా ప్రమాణాల అమలును నిరంతరం పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. లేదంటే ప్రమాదాల ముప్పు కొనసాగుతూనే ఉంటుంది. కార్మికుల ప్రాణాలకు విలువ ఇచ్చే విధానమే పరిశ్రమల అభివృద్ధికి కొలమానం. మూడేళ్ల వ్యవధిలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. చందంపేట వద్ద ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో భారీ రియాక్టర్ పేలుడులో డైరెక్టర్ విక్రమ్ రెడ్డి సహా ఆరుగురు మృతి చెందగా, 20 మందికి పైగా గాయపడ్డారు. బొమ్మలరామారం మండలంలోని సింబియోసిస్ ఫార్మాలో రసాయనాలు కలుపుతుండగా పేలుడు సంభవించి ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురికి గాయాలయ్యాయి. చౌటుప్పల్ మండలంలోని హిందుస్థాన్ ఫార్మాలో కెమికల్ రియాక్టర్ వద్ద మంటలు చెలరేగి ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దండుమల్కాపూర్ సమీపంలోని స్విస్ ఫార్మాలో విషవాయు లీకేజీ, ఫ్లాష్ ఫైర్ ఘటనలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఇలా




ఆయా ఘటనల్లో మొత్తం పద్నాలుగు మంది మృతి చెందగా, మరో ముప్పై ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఖ్యలు భద్రతా వ్యవస్థలపై ఉన్న సందేహాలను మరింత పెంచుతున్నాయి. ప్రతి ప్రమాదం వెనుక కారణాలను బహిరంగంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఘటనలపై పూర్తి నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంచితే బాధ్యత ఎవరిదో స్పష్టమవుతుంది. ఫార్మా ప్లాంట్లలో రియాక్టర్ల వద్ద పీడనం, ఉష్ణోగ్రత నియంత్రణ అత్యంత కీలకం. అయినా కొన్ని యూనిట్లలో పాత యంత్రాలు, పనిచేయని అలారాలు, లోపభూయిష్ట భద్రతా వాల్వ్‌లు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. హెజెలో ల్యాబ్స్, నోష్ ఫార్మా, ఎస్‌బీ ఆర్గానిక్స్ వంటి సంస్థల్లో జరిగిన ఘటనలు సేఫ్టీ ఆడిట్ల ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తున్నాయి. వ్యయ నియంత్రణ పేరుతో శిక్షణ తక్కువగా ఉన్న వలస కార్మికులు, కాంట్రాక్ట్ సిబ్బందిని ప్రమాదకర విభాగాల్లో పనిచేయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రసాయనాల నిర్వహణపై సరైన శిక్షణ లేకపోవడం, రక్షణ పరికరాల కొరత చిన్న లోపాన్ని పెద్ద విపత్తుగా మార్చే ప్రమాదం ఉంది. కొన్ని చోట్ల వేతనాల ఆలస్యం, అదనపు పని గంటలపై ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత విభాగాల స్పందనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భద్రతా పరికరాల తనిఖీ, అత్యవసర డ్రిల్స్, కార్మికుల శిక్షణను తప్పనిసరి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పర్యవేక్షణలో పారదర్శకత లేకపోతే ప్రమాదాల మూల కారణాలు వెలుగులోకి రావు. భద్రతా ప్రమాణాల ఉల్లంఘనను కేవలం పరిపాలనా తప్పిదంగా కాకుండా తీవ్రమైన నేరంగా పరిగణించాలి తప్పదు. పరిస్థితిని మార్చాలంటే హైవే వెంట ఉన్న ఫార్మా యూనిట్లన్నింటిపై ప్రత్యేక భద్రతా ఆడిట్ నిర్వహించాలి. సాధారణ తనిఖీలకు పరిమితం కాకుండా థర్డ్‌పార్టీ నిపుణులతో రియాక్టర్ డిజైన్, ప్రెషర్ సిస్టమ్స్, గ్యాస్ లైన్లు, ఎమర్జెన్సీ షట్‌డౌన్ ఏర్పాట్లు, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను సమగ్రంగా పరిశీలించాలి. ఆటోమేటిక్ గ్యాస్ లీకేజీ అలారాలు, ప్రెషర్ రిలీఫ్ సిస్టమ్స్, అత్యవసర విద్యుత్ నియంత్రణలు పనిచేస్తున్నాయో నిర్ధారించాలి. నిబంధనలు పాటించని యూనిట్లపై అనుమతుల పునఃపరిశీలన, ఉత్పత్తి నిలిపివేత వంటి చర్యలు తీసుకోవాలని కార్మిక వర్గాలు కోరుతున్నాయి. నిర్లక్ష్యంతో ప్రాణనష్టం జరిగితే కేసుల దర్యాప్తు వేగంగా పూర్తిచేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రమాదం జరిగిన ప్రతిసారీ కమిటీలు వేసి నివేదికలను ఫైళ్లకే పరిమితం చేయకుండా ప్రజలకు వెల్లడించాలి. పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక శాఖ, అగ్నిమాపక విభాగం సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అప్పుడే పరిశ్రమల అభివృద్ధి కార్మికుల భద్రతకు విరుద్ధంగా ఉండదన్న నమ్మకం కలుగుతుంది. తనిఖీ ఫలితాలను వెబ్‌సైట్లలో ప్రకటించడం పారదర్శకతకు మరింత బలం చేకూరుస్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం తాత్కాలిక ఊరట మాత్రమే. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబానికి ఆ మొత్తం జీవితాంతం ఎదురయ్యే లోటును పూడ్చలేదన్న వేదన మిగులుతుంది. అందుకే పరిహారం చెల్లింపుతో బాధ్యత ముగిసినట్లు భావించకూడదని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

# కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు?



**మొదటి పేజీ తరువాయి**

ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. పార్టీ వర్గాల్లో ఈ నివేదికపై చర్చ సాగుతోంది. ఆరోపణలకు సంబంధించిన ప్రతి అంశాన్ని కమిటీ నమోదు చేసినట్లు సమాచారం. నిర్ణయం ఆలస్యమైతే అసంతృప్తి మరింత పెరిగే అవకాశముంది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ పరకాలలో చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి కేంద్రబిందువయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని ఉద్దేశించి ఆమె చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్ఠకు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయని కమిటీ ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. తన కుమార్తె మాటలతో తనకు సంబంధం లేదని సురేఖ లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. అవి అభిప్రాయాలేనని సురేఖ స్పష్టం చేశారు. అయితే పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యాఖ్యలు వచ్చిన సమయంలో మంత్రి బహిరంగంగా ఎందుకు ఖండించలేదన్న ప్రశ్నను కమిటీ ప్రస్తావించినట్లు తెలుస్తోంది. తనపై కుట్ర జరుగుతోందంటూ సురేఖ పంపిన లేఖలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేల ఫిర్యాదులు నివేదికలో చోటు దక్కించుకున్నాయి. చివరకు గీత దాటారన్న అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. మరోవైపు మాజీ మంత్రి జి. చిన్నారెడ్డి వ్యవహారం క్రమశిక్షణా కమిటీ ముందుకు వచ్చింది. వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై బహిరంగంగా అనుచిత విమర్శలు చేశారన్న ఆరోపణలపై చిన్నారెడ్డి వివరణ సమర్పించారు. అయితే ఆయన ఇచ్చిన వివరణకు, ఎమ్మెల్యే కమిటీకి అందించిన పెన్‌డ్రైవ్ దృశ్యాలకు, ఫిర్యాదులోని అంశాలకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని కమిటీ గుర్తించినట్లు సమాచారం. పార్టీ పదవిలో ఉన్న నేత సొంత పార్టీ ఎమ్మెల్యేపై బహిరంగ విమర్శలు చేయడం కేడర్‌లో గందరగోళానికి దారితీస్తోందని అభిప్రాయపడింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హెచ్చరిక జారీ చేయడంతో పాటు పదవి నుంచి తప్పించాలని సిఫారసు చేసినట్లు తెలిసింది. దీంతో చిన్నారెడ్డి రాజకీయ పాత్రపైనా ఆసక్తి పెరిగింది. కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారితీసింది. మేఘారెడ్డి వర్గం మాత్రం పార్టీ క్రమశిక్షణ విషయంలో చర్య ఉండాలని కోరుతున్నట్లు సమాచారం. చిన్నారెడ్డి అనుచరులు మాత్రం వివరణకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. చర్చకు దారితీసింది. క్రమశిక్షణా కమిటీ నివేదిక కాంగ్రెస్ అధిష్ఠానం వద్దకు చేరినట్లు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నివేదికను ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌కు, జాతీయ నాయకత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఈ అంశం పూర్తిగా పార్టీ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేశారు. క్రమశిక్షణా కమిటీ నివేదిక ఆధారంగా హైకమాండ్ తీసుకునే తుది నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. దీంతో నిర్ణయంపైనే చూపు నిలిచింది. ఇద్దరిపై పదవీ వేటు పడుతుందా, హెచ్చరికతో వ్యవహారం ముగుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ క్రమశిక్షణ విషయంలో నాయకత్వం ఎలాంటి సందేశం ఇస్తుందన్నది కీలకంగా మారింది. స్థానిక ఎన్నికల వేళ ఈ పరిణామానికి ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్రంలో పార్టీ వ్యవహారాలపై అధిష్ఠానం పర్యవేక్షణ పెరిగిన సమయంలో ఈ నివేదిక రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. నేతల మధ్య విభేదాలను అదుపులో పెట్టడమే నాయకత్వం ముందున్న తక్షణ సవాలుగా కనిపిస్తోంది. కొండా సురేఖ సీనియర్ బీసీ మహిళా నాయకురాలు కావడంతో ఆమె విషయంలో అధిష్ఠానం ఎలా ముందుకు వెళ్తుందన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. ఒకవైపు పార్టీ క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. మరోవైపు కీలక సామాజిక వర్గానికి చెందిన మహిళా మంత్రిపై చర్య తీసుకోవడం రాజకీయంగా సున్నితమైన అంశంగా మారే అవకాశం ఉంది. చిన్నారెడ్డి విషయంలోనూ పార్టీ పదవి, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కీలకంగా కనిపిస్తోంది. ఇద్దరిపై కమిటీ చేసిన సిఫారసులు అమలైతే తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత క్రమశిక్షణపై నాయకత్వం గీత గీసినట్టవుతుంది. అదే సమయంలో అసంతృప్త నేతలకు ఇది హెచ్చరికగా మారవచ్చు. హైకమాండ్ నిర్ణయం కోసం పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. తుది ఆదేశాలు వెలువడిన తర్వాతే ఈ వివాదానికి రాజకీయంగా ఎలాంటి ముగింపు వస్తుందో స్పష్టత రానుంది. అప్పటివరకు ఉత్కంఠ కొనసాగనుంది. రాజకీయంగా ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. కాంగ్రెస్‌లో నేతల మధ్య సమన్వయం, కేడర్‌లో నమ్మకం, ప్రభుత్వ ప్రతిష్ఠ అంశాలు రానున్నాయి.

# మా అమ్మను టార్చర్ పెట్టాడు.. నాన్నను చంపేశాడు!

**విశాలభారతి, పిఠాపురం:** పిఠాపురం ఏఈ నూకరాజు కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడడం ఏపీలో సంచలనం సృష్టించడం తెలిసిందే. ఈ ఘటనలో ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య మరణించగా మనవడు రియాన్ష్ కార్తికేయ రెడ్డి ఒక్కడే బతికి బయటపడ్డాడు. ఈ కేసులో నిందితుడు రైఫిల్ షూటింగ్ కోచ్ సాదిక్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం, అతడికి రిమాండ్ విధించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఐదో తరగతి చదువుతున్న రియాన్ష్ కార్తికేయ రెడ్డి.. షూటర్ సాదిక్‌పై సంచలన ఆరోపణలు చేశాడు. తన తండ్రి మృతికి సాదిక్ ఖానే కారణమని, ప్రోటీన్ షేక్‌లో కెమికల్స్ కలిపి చంపేశాడని ఆ బాలుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తన తల్లిని కూడా సాదిక్ శారీరకంగా హింసించేవాడని, తన కుటుంబాన్ని నాశనం చేసిన అతడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నాడు. ప్రస్తుతం ఈ బాలుడి వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. మంగళవారం జనసేన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ బాలుడు రియాన్ష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగానే బాలుడు మీడియాతో మాట్లాడాడు.

**విలపిస్తూ బాలుడు చెప్పిన వివరాలు..**

"నా పేరు రియాన్ష్ కార్తికేయ రెడ్డి. నేను ఇప్పుడు ఐదో తరగతి చదువుతున్నాను. నాకు రైఫిల్ షూటింగ్ అంటే చాలా ఇష్టం. నేను మూడో తరగతిలో ఉన్నప్పుడు సాదిక్‌తో పరిచయం ఏర్పడింది. తను అప్పుడు నేను చదివే లక్ష్య స్కూల్‌లో పనిచేసేవాడు. అక్కడి నుంచి ఉద్యోగం మానేశాక, తన అకాడమీకి రమ్మని ఫోన్ నెంబర్ ఇచ్చాడు. అలా మా అమ్మతో పరిచయం పెంచుకుని, మా ఇంటికి రావడం మొదలుపెట్టాడు. అప్పటి నుంచి మా అమ్మను కొట్టడం, టార్చర్ చేయడం ప్రారంభించాడు," అని రియాన్ష్ ఆవేదన వ్యక్తం చేశాడు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు.

# ఏ1 రేవంత్‌రెడ్డి, ఏ2 పొంగులేటి!

**మొదటిపేజీ తరువాయి**

డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. కమీషన్ల కోసం సామాన్యుల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి వేధిస్తున్నారని మండిపడ్డారు. షాపూర్‌నగర్‌లో బాధిత కుటుంబాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలను స్వయంగా తెలుసుకున్న హరీశ్‌రావు, బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 22ఏ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో తక్షణ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. రెవెన్యూ మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజల ఆస్తులపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై పారదర్శకత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న పాల్గొన్నారు. బాధితులు తమ పత్రాలతో తిరుగుతున్నా పరిష్కారం కనిపించక ఆందోళన చెందుతున్నారని నేతలు వివరించారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని హరీశ్‌రావు చెప్పారు. 22ఏ జాబితా నుంచి 98 శాతం భూములను తొలగించామని మంత్రి పొంగులేటి చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని హరీశ్‌రావు విమర్శించారు. నిజంగా అంత భూమి తొలగితే వందలాది బాధితులు తమ గోడు చెప్పుకునేందుకు ఎందుకు వస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దేందుకు దరఖాస్తుల పేరుతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. దశాబ్దాల క్రితం పట్టాలు పొందిన భూములు కూడా నిషేధిత జాబితాలోకి వెళ్లడం పాలనలోని గందరగోళానికి నిదర్శనమని అన్నారు. పద్మారావునగర్ ఫేజ్ 1, స్ప్రింగ్‌ఫీల్డ్, నిజాంపేట్ వంటి ప్రాంతాలపై బాధితుల ఫిర్యాదులను ప్రస్తావించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం లంచాలు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. స్ప్రింగ్‌ఫీల్డ్‌లో విల్లా, ఫ్లాట్‌కు రూ.30 వేల చొప్పున వసూళ్లు జరుగుతున్నాయని బాధితులు చెబుతున్నారని తెలిపారు. అమీన్‌పూర్ బాధితులను ఎంఆర్ఓ, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. బయట బ్రోకర్లను సంప్రదిస్తేనే పనులు పూర్తవుతున్నాయన్న ఆరోపణలపై విచారణ కావాలని డిమాండ్ చేశారు. దరఖాస్తుల పరిశీలనలో ప్రమాణాలు ఉండాలని కోరారు. అధికారుల నిర్ణయాలకు బాధితులకు కారణాలు తెలియజేయాలని చెప్పారు. 22ఏ వ్యవహారం వెనుక భారీ కమీషన్ల బాగోతం ఉందని హరీశ్‌రావు ఘాటు ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఏ1, ఏ2గా అభివర్ణించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం తెలుసునని ముఖ్యమంత్రి చెప్పుకుంటే ప్రజల సమస్యలు పరిష్కరించాల్సింది



పోయి వారి ఆస్తులను అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు పరిధిలో విక్రయానికి పెడుతున్నారని విమర్శించారు. పిల్లలు ఆడుకునే పార్కులపై కూడా కన్నేశారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఎకరాల వ్యవసాయ భూములు 22ఏ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరం, యాదాద్రి జిల్లా రాజాపేట మండలం చెల్లూరు గ్రామాల్లో పెద్దఎత్తున భూములు జాబితాలో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ భూములు నిషేధిత జాబితాలో ఉంటే రైతుబంధు, ఎరువులు, విద్యుత్ వంటి సదుపాయాలపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, ముఖ్యమంత్రి ఇల్లు కూడా జాబితాలో ఉన్నాయన్న అంశాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వం తక్షణమే వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నష్టం కలగకుండా పరిష్కార కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి తన తమ్ముడికి వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కట్టబెడుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. సామాన్యుల ఆస్తులను మాత్రం 22ఏలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మల్కాజిగిరిలో బాధితుల పేర్లు నమోదు చేసిన తరువాత భూములు జాబితా నుంచి తొలగించారని తెలిపారు. తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితుల వివరాలు తీసుకున్న తరువాత కూడా కొంత కదలిక కనిపించిందన్నారు. బీఆర్ఎస్ పోరాటం కారణంగానే ప్రభుత్వం స్పందిస్తోందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే 22ఏ సమస్యపై సభను స్తంభింపజేసే స్థాయిలో పోరాటం చేస్తామని ప్రకటించారు. ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ నిలుస్తుందని స్పష్టం చేశారు. పొంగులేటి రాత్రికి రాత్రి చేసిన తప్పుకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. డబ్బుపై దురాశే భవిష్యత్తులో ఇబ్బందులకు కారణమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో సీఎం పాత్ర ఉందని, అందుకే మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రతి బాధితుడి దరఖాస్తును గడువులోగా పరిశీలించి నిర్ణయం ప్రకటించాలని కోరారు. అధికారుల బాధ్యతను కూడా స్పష్టం చేయాలని అన్నారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్న విషయం నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని హరీశ్‌రావు తెలిపారు. విషయం తెలిసినా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. భూములను ఎవరి ఆదేశాలతో 22ఏలో చేర్చారో తేల్చేందుకు స్వతంత్ర విచారణ అవసరమన్నారు. నిషేధిత జాబితాను రహస్యంగా ఉంచడం, వెబ్‌సైట్‌లో వివరాలను బ్లాక్ చేయడం వెనుక కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి పూర్తి నివేదికను ప్రజల ముందు ఉంచాలని కోరారు. ప్రజల భూములతో చెలగాటం ఆడే విధానాన్ని ప్రభుత్వం విడిచిపెట్టాలని అన్నారు. బాధితులకు సులభమైన పరిష్కార విధానం అందుబాటులోకి తేవాలని సూచించారు. రెవెన్యూ శాఖలో పారదర్శకత పెంచాలని డిమాండ్ చేశారు. 22ఏ జాబితా సవరణకు స్పష్టమైన గడువు ప్రకటించాలని కోరారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. వ్యవహారం రాజకీయంగా మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

# పూడిక తీయకుండానే బిల్లులా?

**మొదటిపేజీ తరువాయి**

రికార్డులు సృష్టించి, తరలింపు చేసినట్లు బిల్లులు సమర్పించారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మురీ నాలా నుంచి బలాపూర్ నాలా వరకు, ఓల్డ్‌సిటీ నుంచి న్యూసిటీ వరకు పూడికతీత పనులపై ఎమ్మెల్యేల ఫిర్యాదులు జీహెచ్ఎంసీ విజిలెన్స్ విచారణకు దారితీశాయి. ప్రజాధనం ఖర్చవుతున్నా వర్షం పడితే నగరం ఎందుకు మునుగుతోందన్న ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. రికార్డులు, క్షేత్రస్థాయి పనులు సరిపోలుతున్నాయా? బిల్లులు వాస్తవ పనులకు అనుగుణంగా ఉన్నాయా? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. ఈ ఆరోపణలు నిజమైతే ముంపు నివారణకు కేటాయించిన నిధుల వినియోగంపై పెద్ద ప్రశ్నలు తలెత్తుతాయి. వర్షాకాలానికి ముందు పనులు పూర్తయ్యాయని చెబుతున్న వేళ క్షేత్రస్థాయి వాస్తవాలు భిన్నంగా ఉంటే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. జీహెచ్ఎంసీ పరిధిలో వందల కిలోమీటర్ల నాలాలు, డ్రైనేజ్ మార్గాలు ఉన్నాయి. వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లాలంటే వీటిలో పూడిక పేరుకుపోకుండా నిరంతరంగా తొలగించాలి. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినప్పుడు పూడిక ఎంత తీశారు, ఏ ప్రాంతం నుంచి తీశారు, ఎన్ని వాహనాల్లో తరలించారు, ఎక్కడ డంప్ చేశారు, ప్రతి దశకు ఆధారాలు ఉండాలి. ప్రస్తుతం వినిపిస్తున్న ఆరోపణలు మాత్రం ఈ పర్యవేక్షణ విధానంపైనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పూడిక తీయకుండానే పని పూర్తయినట్లు నమోదు చేశారా? రవాణా జరగకుండానే బిల్లులు పెట్టారా? రోడ్డుపై కనిపించని వాహనాల నంబర్లతో రవాణా చూపించారా? బైక్‌లు, ఆటోలు, కార్ల నంబర్లను పూడిక తరలింపు వాహనాలుగా చూపించారన్న ఆరోపణలు నిజమైతే వ్యవస్థలో తనిఖీలు ఎంత బలహీనంగా ఉన్నాయో స్పష్టమవుతుంది. ప్రజల సొమ్ముకు జవాబుదారీతనం తప్పనిసరి. నాలాల సామర్థ్యం తగ్గితే స్వల్ప వర్షానికే నీరు రహదారులపైకి చేరుతుంది. అందుకే ప్రతి పనికి ముందు, తరువాత స్థితిని నమోదు చేయడం, పూడిక పరిమాణాన్ని కొలవడం, వాహన ప్రయాణాలను ధ్రువీకరించడం కీలకం. కాంట్రాక్టర్‌కు పని అప్పగించడం వరకు ప్రక్రియ ఒక భాగం మాత్రమే. పని నిబంధనల ప్రకారం జరిగిందో లేదో నిర్ధారించడం అధికారుల కీలక బాధ్యత. పూడిక నిజంగా తొలగిందా, వాహనాలు క్షేత్రస్థాయిలో తిరిగాయా, డంపింగ్ ప్రాంతానికి చేరాయా, కొలతలు సరిగ్గా నమోదయ్యాయా, బిల్లులు చెల్లించే ముందు తనిఖీ జరిగిందా అన్న



అంశాలకు స్పష్టమైన ఆధారాలు ఉండాలి. ఎమ్మెల్యేల ఫిర్యాదులపై కమిషనర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించడంతో ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికే అవకాశం కనిపిస్తోంది. విచారణలో కాంట్రాక్టర్ల పాత్రతో పాటు పర్యవేక్షణ చేసిన ఇంజినీర్లు, సిబ్బంది బాధ్యతను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. ఒకవైపు కోట్ల రూపాయల వ్యయం, మరోవైపు ప్రతి వర్షాకాలంలో రోడ్లు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు నీటమునగడం పరిస్థితి తీవ్రతను చూపిస్తోంది. పని జరిగిందని కాగితాలు చెబితే సరిపోదు; నగరానికి దాని ఫలితం కనిపించాలి. అదే అసలు పరీక్ష. విచారణలో కాంట్రాక్టర్ ఫైల్‌ను కాకుండా ప్రక్రియను పరిశీలిస్తే లోపాలు జరిగాయో స్పష్టమవుతుంది. టెండర్ నుంచి కొలతలు, తనిఖీ, బిల్లు చెల్లింపు వరకు ప్రతి దశను విడిగా చూడాలి. ఇలాంటి ఆరోపణలు హైదరాబాద్‌కు కొత్తవి కావు. సుమారు 14 ఏళ్ల క్రితం కూడా నాలాల పూడికతీత పనుల్లో కోట్ల రూపాయల అక్రమాల ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో దాదాపు రూ.40 కోట్ల వ్యవహారంపై దర్యాప్తు సాగగా పలువురు ఇంజినీర్లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఇలాంటి ఆరోపణలు రావడం వ్యవస్థలో మార్పులపై సందేహాలు పెంచుతోంది. పర్యవేక్షణలో లోపమా? కాంట్రాక్టర్లపై నియంత్రణ బలహీనమా? కొలతలు, వాహనాల వివరాలు, డంపింగ్ ఆధారాల పరిశీలనలో లోటుందా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నామని నిరూపించాల్సిన బాధ్యత ఇప్పుడు అధికారులపై ఉంది. విజిలెన్స్ విచారణ కేవలం ఆరోపణలను నమోదు చేసి ముగించకుండా, క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల తనిఖీ, వాహనాల ధ్రువీకరణ, చెల్లించిన బిల్లుల పరిశీలన వరకు వెళ్లాలి. అప్పుడే నిజానిజాలు వెలుగులోకి వస్తాయి. ప్రజలు పన్నుల నుంచి వచ్చే నిధులతో పనులు సాగుతాయి. అందువల్ల రూపాయి ఖర్చుకైనా లెక్క ఉండాలి. గత కేసుల నేపథ్యాన్ని విచారణలో పరిగణనలోకి తీసుకోవాలి.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేని రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకొస్తామనడం విడ్డూరంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలోని విద్యాసంస్థలకు కనీస సౌకర్యాలు కల్పించలేని పాలకులు ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెనలేస్తానన్న చందంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఫీజు బకాయిలతో లక్షలాది విద్యార్థులు మానసిక క్షోభ అనుభవిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం, విదేశీ విద్యాసంస్థలపై ప్రకటనలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ముందుగా స్థానిక కళాశాలల సమస్యలు పరిష్కరించి, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యారంగానికి నిధులు నిలిచిపోతే కొత్త ప్రాజెక్టుల ప్రకటనలు ప్రజలను ఆకట్టుకోవని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో విద్యార్థుల సంక్షేమం ముందుండాలని స్పష్టం చేశారు. బకాయిలకు చెల్లింపులు వేగవంతం చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, నర్సింగ్ తదితర కోర్సులు నిర్వహిస్తున్న వేలాది కళాశాలలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని బండి సంజయ్ తెలిపారు. గత ఐదేళ్లుగా బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో దాదాపు పదిహేను వేల కోట్ల రూపాయలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. అధ్యాపకులు, సిబ్బంది జీతాలు చెల్లించలేక, నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాల యాజమాన్యాలు అప్పుల పాలయ్యాయని ఆరోపించారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలు మూతపడిన పరిస్థితి ఉందన్నారు. రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నత విద్య కొనసాగిస్తున్న సుమారు నలభై లక్షల మంది విద్యార్థుల్లో అధికశాతం దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనని తెలిపారు. బకాయిలు పేరుకుపోవడంతో ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పెరుగుతోందని, నిర్వహణ వ్యవస్థ కుంగిపోతోందని పేర్కొన్నారు. విద్యార్థుల చదువు మధ్యలో ఆగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బకాయిలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచాలని సూచించారు. ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమని కొన్ని ప్రైవేట్ కళాశాలలు చెబుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్ తెలిపారు. ఉద్యో



గాలకు దరఖాస్తు చేయలేక, పైచదువులకు వెళ్లలేక అనేకమంది భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కొందరు కుటుంబ ఆస్తులు అమ్ముకుని ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తెచ్చుకునే దుస్థితి వచ్చిందన్నారు. ఫీజులు చెల్లించిన విద్యార్థులు, బకాయిలపై ఆధారపడిన విద్యార్థుల మధ్య కళాశాల యాజమాన్యాలు వివక్ష చూపుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రెండేళ్ల క్రితం రీయింబర్స్‌మెంట్ బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇకపై నిర్ణీత గడువులో బకాయిలు చెల్లిస్తామని చెప్పిన మాటలు ఎక్కడికి పోయాయని నిలదీశారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ పాలనను మించిపోయిందని ఆరోపించారు. విద్యార్థుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. సకాలంలో నిధులు విడుదల చేస్తే కళాశాలలు స్థిరపడతాయని, విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పారు. సమస్యను త్వరగా ఆలస్యం జరిగే కొద్దీ ఇబ్బందులు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు. ఫీజు బకాయిల సమస్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' దీక్షకు బండి సంజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి స్పందన పెరుగుతోందని తెలిపారు. కళాశాలల మనుగడ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం చేస్తే విద్యా రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ మొత్తాలను స్పష్టమైన కార్యాచరణతో చెల్లించాలని కోరారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందేలా కళాశాలలకు తగిన భరోసా కల్పించాలని సూచించారు. బకాయిలు చెల్లించే వరకు రామచంద్రరావు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. త్వరలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బకాయిల చెల్లింపులపై స్పష్టమైన తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# గురుకులంలో ఘోరం!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

విద్యాబుద్ధులు నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుకుల విద్యాలయం దారి తప్పిందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో పిల్లలను గురుకులాల్లో చేర్పిస్తారు. మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, భద్రమైన వాతావరణం లభిస్తుందని ఆశిస్తారు. అయితే నల్గొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలోని గురుకుల మోడల్ పాఠశాలలో వెలుగులోకి వచ్చిన దృశ్యాలు ఆ నమ్మకాన్ని ప్రశ్నిస్తున్నాయి. పుస్తకాలు పట్టాల్సిన విద్యార్థుల చేతులతో వంట పనులు చేయించినట్టు కనిపిస్తున్న వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా చపాతీలు తయారు చేస్తున్న విద్యార్థుల దృశ్యాలు తీవ్ర చర్చకు దారితీశాయి. విద్యార్థుల సమయాన్ని చదువుకు కేటాయించాల్సిన చోట పనులకు వినియోగించడం సరికాదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని వారు కోరుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గురుకుల విద్యా వ్యవస్థపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టేందుకు అధికారులు స్పందించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మిర్యాలగూడ పరిధిలోని గురుకుల మోడల్ పాఠశాలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి రావడంతో స్థానికంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థులు సమూహంగా కూర్చొని చపాతీలు తయారు చేస్తున్న దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. మరికొన్ని దృశ్యాల్లో ఇతర పనుల్లో విద్యార్థులు నిమగ్నమైనట్టు తెలుస్తోంది. ఈ దృశ్యాలు ఎప్పుడు చిత్రీకరించారనే విషయం, విద్యార్థులతో పనులు ఎందుకు చేయించారనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అయినప్పటికీ విద్యార్థుల చేత వంట పనులు చేయించడం నిబంధనలకు విరుద్ధమైతే బాధ్యులపై చర్యలు తప్పవని పలువురు చెబుతున్నారు. పాఠశా



లలో వంట కోసం ప్రత్యేక సిబ్బంది ఉన్నారా, సిబ్బంది కొరత కారణంగా విద్యార్థులను పనుల్లోకి దింపారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల చదువు, ఆరోగ్యం, భద్రతపై పాఠశాల యాజమాన్యం శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. పిల్లలను శ్రమకు వినియోగించారనే ఆరోపణలు నిజమైతే వ్యవహారం మరింత తీవ్రమవుతుంది. అందుకే వీడియోల ఆధారంగా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా వివరాలు సేకరించి విచారణ జరపాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అధికారులు త్వరగా స్పందించాలి. ఈ వ్యవహారంపై స్పష్టత కోసం తల్లిదండ్రులు వేచి చూస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విద్య, వసతి, పోషకాహారం, క్రమశిక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఇలాంటి పాఠశాలలకు కుటుంబాల పిల్లలు ఎక్కువగా ఆధారపడుతుంటారు. అందుకే అక్కడి ప్రతి చర్యపై అధికారుల పర్యవేక్షణ కీలకంగా ఉంటుంది. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన స్థానంలో పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు రావడం వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రిన్సిపాల్ పర్యవేక్షణ ఎలా ఉంది, వంట సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా, విద్యార్థులకు పనులు అప్పగించడానికి ఎవరు ఆదేశించారు వంటి అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. పాఠశాలల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. చదువుపై ఆసక్తి తగ్గడం, మానసిక ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. విద్యార్థులను గౌరవంతో చూసే వాతావరణం ప్రతి గురుకులంలో ఉండాలి. వారి సమయం పుస్తకాలు, ప్రయోగాలు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలకు ఉపయోగపడాలి. వంట పనులు అవసరమైన సందర్భాల్లో కూడా పిల్లలపై బాధ్యతలు మోపకుండా సిబ్బంది నిర్వహణ ఉండాలి. ఈ ఘటనతో గురుకులాల నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థుల చేత పనులు చేయించిన ఘటనపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గురుకుల మోడల్ పాఠశాలల్లో నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నది అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నాయి. కేవలం కార్యాలయాల నుంచి నివేదికలు తెప్పించుకోవడం కాకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నాయి. పాఠశాలలో విద్యార్థుల కోసం అందుబాటులో ఉన్న సిబ్బంది వివరాలు, వంటశాల నిర్వహణ, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. వైరల్ వీడియోల వెనుక ఉన్న పూర్తి నేపథ్యాన్ని తెలుసుకోవడం కూడా కీలకమే. విద్యార్థులు స్వచ్ఛందంగా ఏదైనా కార్యక్రమంలో పాల్గొన్నారా, లేక బలవంతంగా పనులు చేయించారా అన్నది నిర్ధారించాలి. ఘటనలో తప్పు తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంఘాలు కోరుతున్నాయి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో మాట్లాడి పాఠశాలలో ఎదురవుతున్న పరిస్థితులను తెలుసుకోవాలని సూచిస్తున్నారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తే సమస్యలు ముందుగానే బయటపడే అవకాశం ఉంటుంది. ప్రతి గురుకులంలో విద్యార్థుల హక్కులను కాపాడే విధానాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని వారు అంటున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఘటన నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గురుకులాల్లో విద్యార్థులే కేంద్రబిందువుగా విధానాలు అమలు కావాలి. వారి చదువు మధ్యలో ఇతర పనులు అడ్డంకిగా మారకూడదు. వంట, శుభ్రత, నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సమర్థంగా వినియోగించాలి. సిబ్బంది కొరత ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. పిల్లలపై భారం మోపడం పరిష్కారం కాదని అధికారులు స్పష్టం చేయాలి. ప్రతి పాఠశాలలో పర్యవేక్షణ రిజిస్టర్, ఫిర్యాదు విధానం, తల్లిదండ్రుల సమావేశాలను బలోపేతం చేయడం అవసరం. విద్యార్థుల గౌరవం, భద్రత, విద్యా హక్కులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మిర్యాలగూడ ఘటనపై నిజానిజాలు వెలుగులోకి రావడం కోసం సమగ్ర విచారణ పూర్తిచేసి నివేదికను ప్రజలకు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు. గురుకులాలపై తల్లిదండ్రులు పెట్టుకున్న విశ్వాసం దెబ్బతినకుండా ప్రభుత్వం వేగంగా స్పందించాల్సిన సమయం ఇదే. విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉండాలి, పనిముట్లు కాదు అన్న సందేశం స్పష్టంగా నిలవాలి.

## తగిలేపల్లి మాజీ సర్పంచ్ హత్యకు నిరసనగా వర్ని చౌరస్తాలో ధర్నా

**విశాలభారతి, కామారెడ్డి:** వర్ని మండలం తగిలేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మైసమ్ వెంకటేశ్వర్లు (వెంకన్న) హత్యకు నిరసనగా వర్ని చౌరస్తాలో సోమవారం ధర్నా నిర్వహించారు. మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

**భాస్కర్ రెడ్డి ఏమన్నారంటే..**

ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్ వెంకన్న హత్య తీవ్రంగా



కలచివేసిందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో హత్యా రాజకీయాలకు, హింసకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గతంలో ప్రశాంతంగా ఉన్న బాన్సువాడలో వలస నాయకుల రాజకీయ జోక్యంతో హింస, అలజడి పెరిగిందని ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన బక్క నారాయణ ఈ ఘటనలో నిందితుడిగా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారని, ఆయన ఏనుగు రవీందర్ రెడ్డి ప్రధాన అనుచరుడని భాస్కర్ రెడ్డి ఆరోపించారు. ఈ ఘటన వెనుక ఉన్న పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గం ఎప్పుడూ శాంతి, సామరస్యాలకు నిలయమని, ఇక్కడ హింసకు, హత్యా రాజకీయాలకు, భయభ్రాంతులకు ఎలాంటి స్థానం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల్లో భయాన్ని కలిగించే రాజకీయాలకు స్వస్తి పలకాలని, హింసను ప్రోత్సహించే రాజకీయ నాయకత్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ధర్నా సందర్భంగా కార్యకర్తలు "హత్యా రాజకీయాలను ప్రోత్సహించే నాయకుడు ఏనుగు రవీందర్ రెడ్డి డౌన్ డౌన్, హత్యా రాజకీయాలు నశించాలి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# ఐసీఎఫ్ఏఐలో అంతరిక్ష సందడి.. ఇస్రో 'స్పేస్ ఆన్ వీల్స్' ప్రత్యేక ఆకర్షణ

**200 మందికి పైగా విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై ప్రత్యక్ష అవగాహన**





**చేవెళ్ల, విశాల భారతి :** జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐఎఫ్‌హెచ్‌ఈ)లోని ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏక్యోమ్ క్లబ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎస్‌సీ-ఇస్రోకు చెందిన 'స్పేస్ ఆన్ వీల్స్' మొబైల్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత అంతరిక్ష పరిశోధనా రంగం సాధించిన విజయాలు, ఉపగ్రహ సాంకేతికత, భూ పరిశీలన వ్యవస్థలు, వివిధ అంతరిక్ష ప్రయోగాలు, ప్రయోగ వాహనాలపై విద్యార్థులకు నిపుణులు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఉపగ్రహ నమూనాలు, వర్కింగ్ మోడల్స్, విజువల్ ప్యానెల్స్, ఆడియో-విజువల్ ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఆర్ఎస్‌సీ-ఇస్రో హైదరాబాద్‌లో హెడ్ ఆఫ్ స్టూడెంట్ అండ్ పబ్లిక్ అవుట్‌రీచ్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్. శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సాధించిన చారిత్రాత్మక విజయాలతో పాటు భవిష్యత్‌లో చేపట్టనున్న మిషన్ల గురించి వివరించారు. అంతరిక్ష సాంకేతికత వ్యవసాయం, వాతావరణ అంచనాలు, విపత్తుల నిర్వహణ, సమాచార వ్యవస్థలు, భూ పరిశీలన వంటి అనేక రంగాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని అంతరిక్ష రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన భారీ చంద్రుని ఉపరితల నమూనా విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. చంద్రుని ఉపరితలంలోని క్రేటర్లు, చంద్ర అన్వేషణ, మ్యాపింగ్, గ్రహ విజ్ఞానానికి సంబంధించిన అంశాలను నిపుణులు విద్యార్థులకు వివరించారు. గగన్‌యాన్, మంగళయాన్ వంటి ప్రతిష్ఠాత్మక భారత అంతరిక్ష మిషన్లకు సంబంధించిన నమూనాలను కూడా విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 200 మందికి పైగా పాఠశాల విద్యార్థులు పాల్గొనడం విశేషం. పాఠ్యపుస్తకాల్లో నేర్చుకున్న అంశాలను వాస్తవ ప్రపంచంలోని అంతరిక్ష సాంకేతికతతో అనుసంధానించుకునే అవకాశం విద్యార్థులకు లభించింది. ఇస్రో నిపుణులను ప్రశ్నిస్తూ వివిధ అంతరిక్ష మిషన్లు, సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై వారు అవగాహన పొందారు. కార్యక్రమంలో ఐఎఫ్‌హెచ్‌ఈ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినయ్ కుమార్, ఎఫ్ఎస్‌టీ డైరెక్టర్ డాక్టర్ కె.ఎల్. నారాయణ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ ఆర్. శ్రీనివాస్‌ను నిర్వాహకులు సత్కరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకత, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

## ఫార్మ్ పాండ్‌తో రైతులకు మేలు

**దేవలమ్మ నాగారంలో శంకుస్థాపన చేసిన గౌరీ శ్రీనివాస్ గౌడ్**



**చౌటుప్పల్,విశాలభారతి:** ఫార్మ్ పాండ్ ల నిర్మాణంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని దేవలమ్మ నాగారం సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో మంగళవారం ఫార్మ్ పాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల వద్ద ఫార్మ్ పాండ్ లను నిర్మించుకోవడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, తద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెంది బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని తెలిపారు. నీటి కొరత లేకుండా పంటలు సమృద్ధిగా పండించుకోవచ్చని, ప్రతి రైతు ఫార్మ్ పాండ్ ను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, గట్టు ప్రశాంత్, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక

- **జిల్లా అధ్యక్షుడిగా ఎర్రోళ్ల శాంతి కుమార్**
- **పార్టీ బలోపేతానికే నావంతు కృషి చేస్తా,ఎర్రోళ్ల శాంతి కుమార్**



**చౌటుప్పల్, విశాలభారతి:** ధర్మ సమాజ్ పార్టీ యాదాద్రి జిల్లా నూతన కమిటీని చౌటుప్పల్ మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ,యస్సి,యస్టీ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జ్ రాసాల వినోద్ యాదవ్ మరియు ధర్మ సమాజ్ పార్టీ యాదాద్రి జిల్లా ఇన్చార్జ్, రాష్ట్ర నాయకులు నల్లా నరేందర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ వివరాలు: జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల శాంతి కుమార్,జిల్లా ఉపాధ్యక్షులు రాసాల అశోక్ యాదవ్, కొంగరి లింగస్వామి, సుదెల మహేష్,ప్రధాన కార్యదర్శి వెలువర్తి శ్రీకాంత్,జిల్లా కార్యదర్శులు బిఆర్ సాయి కుమార్, ఏర్పుల సురేష్, కొమ్ము సాయికిరణ్, బందెల రవి,జిల్లా మీడియా ఇన్చార్జ్ పంది నగేష్, నార్కట్పల్లి సుధాకర్ మాదిగ జాగృతి సంఘం జిల్లా నాయకులు గడ్డం జలంధర్ అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా కమిటీ ఎల్లప్పుడూ ముందుండాలని, ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల శాంతి కుమార్ మాట్లాడుతూ... "యాదాద్రి జిల్లాలో ధర్మ సమాజ్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తాం. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్.మహేష్, సి హెచ్.సాయి కుమార్, నరేందర్, గణేష్, సందీప్, లింగస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ. 1.34 లక్షలతో మరుగుదొడ్ల పునర్నిర్మాణం



**నిజామాబాద్, విశాలభారతి:** మధుమలాంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్తిస్థాయిలో పునర్నిర్మించిన విద్యార్థుల మరుగుదొడ్లను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) పి. అశోక్ మంగళవారం ప్రారంభించారు. గత నెలలో మీడియాలో వచ్చిన కథనాలపై స్పందించిన జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ మరమ్మతు పనులను చేపట్టినట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు. దాతలు, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో మొత్తం రూ. 1,34,162 వ్యయంతో ఈ నిర్మాణాలు పూర్తి చేశారు. ట్రస్మా మరియు బోధన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్: రూ. 1,00,000, జి. విద్యాసాగర్ (పూర్వ విద్యార్థి): రూ. 25,000 (తండ్రి కీర్తిశేషులు జి. సీతారామయ్య జ్ఞాపకార్థం), ఎంఈఓ నాగయ్య: రూ. 7,162 ఉదయ్ కిరణ్ మహారాజ్ (పూర్వ విద్యార్థి): రూ. 2,000, మరుగుదొడ్లను ప్రారంభించిన అనంతరం డీఈఓ పి. అశోక్ మాట్లాడుతూ, విద్యార్థులు మరుగుదొడ్లను పరిశుభ్రంగా వినియోగించుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చిన దాతలను, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కిషోర్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి సురేష్, మాజీ జోనల్ చైర్మన్ విద్యావికాస్ శ్రీనివాస్, ప్రతినిధులు చక్రవర్తి, జయప్రకాష్, ఉపాధ్యాయుడు నరేందర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## సింగరాజు పల్లిలో ఘనంగా వన మహోత్సవం



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలంలోని సింగరాజు పల్లి గ్రామపంచాయతీలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేనక పౌడెల్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఉప్పునూతల మోహన్, సర్పంచ్ కొండ ఊర్మిళా మల్లారెడ్డి, ఉపసర్పంచ్ జోగు అనిల్, పంచాయతీ కార్యదర్శి నజియా, ఫీల్డ్ అసిస్టెంట్ రాపాక కృష్ణ, వార్డు సభ్యులు ఉపాధి కూలీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మేనక పౌడెల్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నాటిన మొక్కలను సౌరక్షిస్తూ గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు.

## GO 97 రద్దు డిమాండ్‌తో పాలిటెక్నిక్ కళాశాలల బంద్ విజయవంతం : ఏబీవీపీ

**విశాలభారతి, సిద్దిపేట :** GO 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పిలుపు మేరకు చేపట్టిన రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌లో భాగంగా చేర్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులు నిరసన చేపట్టారు. తరగతులను బహిష్కరించిన విద్యార్థులు కళాశాల ముందు GO 97 ప్రతులను దహనం చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సావుల ఆదిత్య మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మార్గం చూపే కీలక విద్యా వ్యవస్థ అని పేర్కొన్నారు. GO 97 అమలుతో పాలిటెక్నిక్ విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉన్నత విద్య అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కీలక నిర్ణయాలు అమలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇప్పటికే అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయాల సమస్యలు, ప్రయోగశాలల కొరత, ఆధునిక సాంకేతిక పరికరాల లేమి వంటి సమస్యలు ఉన్నాయని ఆదిత్య పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులపై అదనపు భారం పడే విధానాలు అమలు చేస్తే వారి భవిష్యత్తు మరింత అనిశ్చితిలో పడే ప్రమాదం ఉందన్నారు.

## చౌటుప్పల్‌లో ఘనంగా వనమహోత్సవం



- **మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం**
- **చైర్ పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్**

**చౌటుప్పల్,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చౌటుప్పల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వనమహోత్సవం 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని 13వ వార్డులోని జయభూమి వెంచర్ లో గల బాలాజీ టెంపుల్ ఎదురుగా ఉన్న 10% స్థలంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఐరా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని పచ్చదనం కోసం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పావని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, రాబోయే తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. చౌటుప్పల్ పట్టణంలో 30% అటవీ ప్రాంతం ఉందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెరగాలని, నాటిన ప్రతి మొక్కను తమ బిడ్డలా సంరక్షించాలని సూచించారు. వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు మొక్కలు నాటడాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ మాట్లాడుతూ.. మొక్కల సంరక్షణ బాధ్యత మనందరిదీ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోసనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, పాక చిరంజీవి, పిల్లలమర్రి మధుసూదన్, కోఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, నాయకులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, ఉడుగు రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, మేనేజర్ అంజయ్య, ఫారెస్ట్ అధికారి మెహరాజ్, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, ఐరా పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ బి. మమత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు జయభూమి వెంచర్ కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అక్రమ బియ్యం పట్టివేత, ఇద్దరి అరెస్ట్



**చౌటుప్పల్,విశాల భారతి:** మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా బియ్యం సేకరించి హైదరాబాద్ కు తరలిస్తున్న ముఠాను చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. తేదీ 25.08.2026 న అందిన సమాచారం మేరకు, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆదేశాల మేరకు, ఏఎస్ఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో పెట్రోల్ మొబైల్ సిబ్బంది పిసి3554 ఎం. సందీప్, ఏఆర్పీసీ 7967 ఎల్. సీతారాం రెడ్డి లు చౌటుప్పల్ వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అనుమానాస్పదంగా వస్తున్న ఒక వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో సుమారు 25 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్ ను విచారించగా అతను మిర్యాలగూడ చుట్టుపక్కల గ్రామాల్లో రైతుల నుండి బియ్యాన్ని కొనుగోలు చేసి హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు తెలిపాడు. దీనికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు వాహనాన్ని సీజ్ చేశారు. పట్టుబడిన వారి వివరాలు లావుడ్యా శ్రీనివాస్, తండ్రి లాచిరామ్, వయస్సు 30 సంవత్సరాలు,గుగులోతు అరుణ్, తండ్రి శంకర్, వయస్సు 18 సంవత్సరాలు ఇద్దరిపై చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఇన్స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు.

## లంబాడీ ఐక్యవేదిక జోనల్ మీడియా సెక్రటరీగా బోడ నర్సింగ్ నాయక్



**డోర్నకల్, విశాలభారతి:** లంబాడీ ఐక్యవేదిక (లైవ్) ఖమ్మం-కొత్తగూడెం-మహబూబాబాద్ జోనల్ మీడియా సెక్రటరీగా బోడ నర్సింగ్ నాయక్‌ను నూతనంగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు లంబాడీ ఐక్యవేదిక నాయకులు, ప్రతినిధులు అభినందనలు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతను అప్పగించిన లంబాడీ ఐక్యవేదిక నాయకత్వానికి బోడ నర్సింగ్ నాయక్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు లంబాడీ సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో లంబాడీ సమాజానికి సంబంధించిన సమస్యలు, హక్కులు, అభివృద్ధి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. సమాజానికి సంబంధించిన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ, లంబాడీ ఐక్యవేదిక కార్యకలాపాలను ప్రజలకు చేరువ చేయడంలో తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.అప్పగించిన బాధ్యతను ఒక పదవిగా కాకుండా సమాజ సేవకు లభించిన అవకాశంగా భావించి నిబద్ధతతో పనిచేస్తానని బోడ నర్సింగ్ నాయక్ స్పష్టం చేశారు. తనకు సహకరిస్తున్న నాయకులు, యువత, సామాజిక కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

- **ముఖ్య అతిథి మోరంపల్లి బంజర సర్పంచ్ సుభద్ర**
- **కుటుంబంలో పెద్దల పాత్రను పిల్లలకు తెలియజేయలి : ప్రిన్సిపల్ సుమలత**
- **పెద్దలు కుటుంబానికి అందించే ప్రేమ విలువలు ఎంతో గొప్పవి : సర్పంచ్ సుభద్ర**



**బూర్గంపాడు, విశాలభారతి :** బూర్గంపాడు మండలంలోని స్టెల్లామెరి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మొరంపల్లి బంజర సర్పంచ్ సుభద్ర విచ్చేసి కుటుంబ పెద్దల పాత్రను విద్యార్థులకు వివరించారు . ఈ కార్యక్రమానికి విద్యార్థుల తాతయ్యలు,నానమ్మలు, అమ్మములను స్టెల్లా మెరిస్ స్కూల్ సిబ్బంది ప్రత్యేకంగా ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ తాతయ్యలు నానమ్మలతో కలిసి ఆనందంగా గడిపారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు,పాటలు,నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. పెద్దలు కుటుంబానికి అందించే ప్రేమ అనుభవం, విలువలు ఎంతో గొప్ప వని స్కూల్ ప్రిన్సిపల్ సుమలత పేర్కొన్నారు. కుటుంబంలో పెద్దల పాత్రను పిల్లలకు తెలియజేయడమే గ్రాండ్ పేరెంట్స్ డే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తాతయ్యలు నానమ్మలు అమ్మమ్మలు పాల్గొన్నారు.

## పెద్దమడూరులో ఘనంగా వనమహోత్సవం



**దేవరుప్పుల విశాలభారతి :** మండలం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్దమడూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిపిఒ శ్రీ వెంకట్ రెడ్డి హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ పానుగంటి గిరి, ఉపసర్పంచ్ సీహెచ్. సంపత్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఎన్. రాధిక, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నమడూరులో పాపన్న విగ్రహావిష్కరణ





**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం చిన్నమడూరు గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన కేజి కెఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు, కల్లుగీత కార్మికులు, నాయకులు, యువతకు చిన్నమడూరు గ్రామ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం (టి సిఎస్) అధ్యక్షులు ముసిగంపల నరేష్ గౌడ్, పంచనకర్త పరిధిల లక్ష్మీ నరసయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వార్డు సభ్యులు, ఉప సర్పంచ్, పాపన్న విగ్రహదాత వంగ పద్మ-వెంకటేశ్వర్లు, అన్నదాన దాత రాంపల్లి శ్రీనివాస్ గౌడ్,టిసిఎస్ కమిటీ సభ్యులు, కల్లుగీత కార్మికులు, నాయకులు, చిన్నమడూరు గ్రామ యువతకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.పరమేశ్,ఎ.మౌనికరాజు, బి. వెంకటేశ్వర్లు ,ఎం.ఐలయ్య,పి.క్రిష్ణమూర్తి,బి.సుదర్శన్,పి.క్రిష్ణ,బి.నారాయణ,ఆర్.నర్సయ్య,ఆర్.శ్రీనివాస్,ఎమ్.నరసయ్య,ఎం.ఐలయ్య,ఎం.పర్శరాములు,వి.దశరథ,వి.మల్లేశ్,వి.అర్జున్,ఎం.క్రిష్ణమూర్తి,పి.సోమయ్య,బి.క్రిష్ణమూర్తి,పి.శ్రీదర్,ఎం.తిరుమలేశ్,ఎం.సోమయ్య, ఎం.హరీశ్,డి.శ్రీనివాస్,బి.బాలనర్సయ్య,ఎం.సమ్మయ్య, మరియు సందర్భంగా కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## వీధి వ్యాపారులపై అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

**ది సిటిజన్స్ కౌన్సిల్ డిమాండ్**




**రాజేంద్రనగర్, విశాల భారతి:** మణికొండ వీధి వ్యాపారుల వద్ద మధ్యవర్తుల పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిజాలు తేలితే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ది సిటిజన్స్ కౌన్సిల్ డిమాండ్ చేసింది. పేదల జీవనోపాధికి అడ్డంకిగా మారేలా వసూళ్లు చేయడం సరికాదని పేర్కొంది. మణికొండ మున్సిపాలిటీగా ఉన్న సమయంలో వీధి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు 'థాయ్ బజార్' నిర్వహణకు టెండర్లు పిలవడంతో, జీవనోపాధి పరిరక్షణ వీధి వ్యాపారుల నియంత్రణ చట్టం-2014 అమలు చేయాలని ది సిటిజన్స్ కౌన్సిల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిందని ప్రతినిధులు తెలిపారు. అనంతరం థాయ్ బజార్ పేరుతో వసూళ్లు నిలిచిపోవడంతో చిన్న వ్యాపారులకు కొంత ఉపశమనం లభించిందన్నారు. మణికొండ మున్సిపాలిటీ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత వీధి వ్యాపారులకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సౌకర్యం కల్పించకుండానే రోడ్లపై నుంచి తొలగించడం చట్ట నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. సంప్రదింపుల అనంతరం నార్సింగి డిప్యూటీ కమిషనర్ కొన్ని షరతులతో వీధి వ్యాపారులకు అనుమతి ఇచ్చారని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ కోసం రూ.50 నిర్ణయించగా, ప్రస్తుతం చెత్త ఉన్నా లేకున్నా రూ.1,000 రసీదుతో, మరో రూ.1,000ను రసీదు లేకుండా జరిమానా పేరుతో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ వసూళ్లపై అధికారులు వెంటనే విచారణ జరిపి, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి వ్యాపారుల చట్టం-2014 స్ఫూర్తికి అనుగుణంగా పేద వ్యాపారుల జీవనోపాధికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ సీతారాం ధూళిపాల, అధ్యక్షుడు ఉపేంద్రనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, కార్యదర్శి ఆరీఫ్ మహమ్మద్, సభ్యులు రామ సుబ్బారెడ్డి, సాగర్, మాజీ కోశాధికారి దిలీప్ కక్కడ తదితరులు ఈ డిమాండ్ చేశారు.

# విజ్ఞాన్ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ సెరిమనీ

- విద్య క్రీడలు సృజనాత్మక వ్యక్తిత్వ వికాసాలు వినియోగించుకోవాలి
- ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు ఆదిభట్ల సీఐ రమేష్
- ఎస్సై వెంకటేష్, సంస్థ వ్యవస్థాపకులు మర్రి నిరంజన్ రెడ్డి





**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

హైదరాబాద్ పరిధిలోని బడంగ్పేట్ సర్కిల్, నాదర్గుల్ డివిజన్‌లోని విజ్ఞాన్ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, ఆదిబట్ల ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేశ్ , ఎస్సై వెంకటేష్ , సంస్థ వ్యవస్థాపకులు మర్రి నిరంజన్ రెడ్డి నిత్య , ప్రిన్సిపల్ ఎండీ ఇష్క్ హుస్సేన్ పాల్గొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, క్రమశిక్షణను పెంపొందించే ఉద్దేశంతో నూతన విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్ పి ఎల్ )గా రేశ్వంత్, గర్ల్స్ పీపుల్ లీడర్‌గా గాయత్రి ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా పాఠశాలలోని నాలుగు హౌస్‌లకు చెందిన హౌస్ క్యాప్టెన్లు, సెక్రటరీలు, క్లాస్ లీడర్లు కూడా ప్రమాణ స్వీకారం చేసి, తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, అంకితభావంతో నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రెసిపీ కేపీవి రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో పిల్లలు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, రీల్స్, యూట్యూబ్ వంటి వాటికి అధిక సమయం కేటాయించకుండా స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ వారికి సరైన మార్గదర్శనం చేయాలని కోరారు.సోషల్ మీడియా ప్రభావంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఆకర్షితులై అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొంటూ, విద్యార్థులు ఇటువంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. తమ విలువైన సమయాన్ని విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సంస్థ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాలని అన్నారు.నేటి విద్యార్థులే రేపటి పౌరులు. క్రమశిక్షణతో పాటు మంచి విలువలు, బాధ్యత, సమయపాలన, సేవాభావాన్ని అలవర్చుకుంటేనే సమాజాన్ని, దేశాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలరని అన్నారు. విద్యార్థులు చిన్న లక్ష్యాలతో సరిపెట్టుకోకుండా పెద్ద పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని నిరంజన్ రెడ్డి సూచించారు. నాయకత్వం అంటే కేవలం ఒక పదవి కాదని, అప్పగించిన బాధ్యతను నిర్ణీత సమయంలో, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ పూర్తి చేయడమే నిజమైన నాయకత్వమని పేర్కొన్నారు. ఈ ఇన్వెస్టిచర్ సెరిమనీ విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తి, బాధ్యత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉత్సాహభరితంగా సాగిందని అన్నారు.

## మిలాద్ ఉన్ నబీకి పటిష్ట బందోబస్తు.. అత్తాపూర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు



**రాజేంద్రనగర్, విశాల భారతి:** అత్తాపూర్ మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని అత్తాపూర్ పోలీసులు మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీల్లో కవాతు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య ఆధ్వర్యంలో బైక్ మెకానిక్‌లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందించారు. వాహనాల సైలెన్సర్లను తొలగించడం, వాటికి అదనపు మార్పులు చేయడం వంటివి చేయవద్దని మెకానిక్‌లను హెచ్చరించారు. పండుగ ర్యాలీల సమయంలో సైలెన్సర్లతో అధిక శబ్దం చేసే వాహనదారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మెకానిక్‌లు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను తొలగించినా, మార్పులు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు. ర్యాలీలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ సీతయ్య కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై పోలీసులు నిఘా పెంచారు. అనంతరం రాత్రి ప్రధాన రహదారులపై విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారికి హెచ్చరికలు జారీ చేశారు.

## అప్పుల ఒత్తిడితో ఆర్ఎంపీ అదృశ్యం

**ఆన్‌లైన్ రుణాల ఒత్తిడితో ఆందోళన.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:** అప్పుల ఒత్తిడితో ఆర్ఎంపీ వైద్యుడు అదృశ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతానికి చెందిన బాల్ల సత్యనారాయణ ప్రసాద్ (49) ఆర్ఎంపీ వైద్యుడిగా పని చేస్తూ కవాడిపల్లి రోడ్డులోని వీవీఎం గ్రాండ్ వద్ద సత్య ప్రసాద్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పరిచయస్తుల వద్ద చేతి అప్పులు చేయడంతో పాటు ఆన్‌లైన్ రుణ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నట్లు ఆయన భార్య బాల్ల సవిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రుణాలను తిరిగి చెల్లించలేకపోవడంతో సత్యనారాయణ ప్రసాద్ మానసికంగా ఆందోళనకు గురైనట్లు ఆమె తెలిపింది. రుణాల వసూలు కోసం ఏజెంట్ల నుంచి ఒత్తిడి పెరగడంతో తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పేవాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం సుమారు 3.30 గంటలకు భోజనం చేసేందుకు ఇంటికి వచ్చిన సత్యనారాయణ ప్రసాద్ అనంతరం తిరిగి తన దుకాణానికి వెళ్లారు. ఆ తర్వాత ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఆయన మొబైల్ ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సత్యనారాయణ ప్రసాద్ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ఆయన చివరిగా ఎక్కడికి వెళ్లారు, ఎవరిని కలిశారు అనే వివరాలను సేకరిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

## అల్లాపురంలో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం

- ప్రతి ఒక్కరం ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి
- టేకుల మంజుల దిలీప్ రెడ్డి సర్పంచ్ల ఫోరం జిల్లా మహిళా అధ్యక్షురాలు



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని అల్లాపురం గ్రామంలో సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి గారి ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో మరియు ప్రధాన వీధుల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం సర్పంచ్ మంజుల దిలీప్ రెడ్డి మాట్లాడుతూ.. నేడు ఎల్ నినో లాంటి వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, తీవ్ర ఎండలు రావడానికి ప్రధాన కారణం చెట్లను విచ్చలవిడిగా నరకడం, వాటి స్థానంలో తిరిగి మొక్కలు నాటకపోవడమేనని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని గ్రామస్తులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయిని లింగస్వామి, వార్డు సభ్యులు భూతం లింగస్వామి, ఎంజాల శ్రీకాంత్, సామ సుమిత్ర పెద్దిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వర్ణ, విలేజ్ సెక్రటరీ సురేష్, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు.

## కామారెడ్డిలో ఘనంగా మిలాద్‌ఉన్‌నబీ వేడుకలు

**రక్తదాన శిబిరం మానవత్వానికి నిదర్శనం**

**విశాలభారతి, కామారెడ్డి:** ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వసల్లం) జయంతి మిలాద్‌ఉన్‌నబీ వేడుకలను కామారెడ్డి పట్టణంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని చారిత్రాత్మక మదీనా మసీదు వద్ద ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం అందరి ప్రశంసలు అందుకుంది. 'సేవయే దైవ సేవ' అనే దివ్య సందేశానికి నిదర్శనంగా ఈ శిబిరం నిలిచింది. ప్రవక్త బోధించిన ప్రేమ, కరుణ, సోదరభావ సందేశాన్ని ఆచరిస్తూ స్థానిక యువత, జమాత్ సభ్యులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. ఒక ప్రాణాన్ని కాపాడటం సమస్త మానవాళిని కాపాడటంతో సమానమన్న ప్రవక్త సందేశంతో స్ఫూర్తి పొంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సేకరించిన రక్తాన్ని అత్యవసర వైద్య సేవలకు, తలసేమియా బాధిత చిన్నారులకు, పేద రోగులకు అందజేయనున్నారు. మిలాద్‌ఉన్‌నబీ అంటే కేవలం వేడుకలు మాత్రమే కాదని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన భక్తి అని మదీనా మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## శంషాబాద్ ఆర్బీ నగర్‌లో ఘనంగా వన మహోత్సవం



**మొక్కలు నాటిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఆర్బీ నగర్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పర్యావరణ పరిరక్షణలో భాగంగా పలు మొక్కలను స్వయంగా నాటారు. ఈ సందర్భంగా కాలనీ పరిసరాల్లో పచ్చదనం పెంపొందించేందుకు పెద్ద సంఖ్యలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు వన మహోత్సవం, హరితహారం వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. మొక్కలు పెరిగి చెట్లుగా మారినప్పుడే వాటి అసలు ప్రయోజనం ప్రజలకు అందుతుందని, నాటిన ప్రతి మొక్క బాధ్యతను స్థానికులు తీసుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంచడం ద్వారా ఉష్ణోగ్రతలను తగ్గించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నారులు, యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యత తీసుకుంటే సమాజంలో పచ్చదనం మరింత విస్తరిస్తుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్బీ నగర్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో వన మహోత్సవం కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు కృషి చేయాలి



**మంచాల ఎంపీడీఓ వసంతలక్ష్మి**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** వన మహోత్సవం కార్యక్రమంలోభాగంగా మంచాల మండలం కేంద్రంలో మంగళవారం గ్రామ సర్పంచ్ మానస వినయ్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో వసంతలక్ష్మి, ఎమ్మార్వో ప్రసాద్, ఎంఈఓ రాందాస్, ఏపీఎం శేఖర్, సీఐ మధు, విద్యార్థులు పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. చెట్లను పెంచి పచ్చదనాన్ని పెంపొందించి భావితరాలకు ఆరోగ్యకరమైన ప్రశాంత వాతావరణాన్ని అందించాలని, కోరారు.ఈ కార్యక్రమంలో టిపిఎస్ ప్రిన్సిపల్ ఝాన్సీ, మండల అధ్యక్షులు ఎద్మా నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ లింగం, ఏపీవో ఆంజనేయులు, వార్డు సభ్యులు గ్యార జంగయ్య, నీళ్ల పారిజాత కృష్ణ, గడ్డం పారిజాత బాబయ్య,టి ఏ శేఖర్ నాయకులు గ్యార జగన్ తదితరులు పాల్గొన్నారు

## ఉప సర్పంచ్‌ల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కాలె అనిత రమేష్ నియామకం

**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** హైదరాబాద్‌లో ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లావుడ్య రాములు నాయక్ రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, యాచారం మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కాలె అనిత -రమేష్‌ను ఉప సర్పంచ్‌ల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా కాలె అనిత రమేష్ మాట్లాడుతూ, నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లావుడ్య రాములు నాయక్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల సమస్యలు, హక్కులు సంక్షేమం కోసం కృషి చేస్తూ, ఉప సర్పంచ్‌ల సంఘాన్ని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేసేందుకు నా వంతు కృషి చేస్తానని, ఉప సర్పంచ్ హక్కుల సాధన కోసం పోరాటం చేసేందుకు ముందుంటానని తెలిపారు.





## గవర్నర్‌కు వీడ్కోలు పలికిన కలెక్టర్, ఎస్పీ

**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ జిల్లా పర్యటనకు హాజరై కార్యక్రమాలు ముగించుకుని తిరుగు ప్రయాణం అయిన రాష్ట్ర గవర్నర్ శ్రీ సి.శివ ప్రతాప్ శుక్లా కు జిల్లా ఉన్నతాధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తదితరులు గవర్నర్ కు వీడ్కోలు పలికారు. గవర్నర్ వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ ఉన్నారు.

## ఘనంగా వన మహోత్సవం



**నిజామాబాద్, విశాలభారతి:** పనమహోత్సవం సందర్భంగా నిజామాజాద్ అటవీ శాఖ అధ్వర్యంలో మాంచిప్ప రిజర్వ్ ఫారెస్ట్లోని కంపార్ట్మెంట్ నం. 180, మల్లారం బిట్, మల్లారం సెక్షన్, నిజామాబాద్ నార్త్ రేంజ్ పరిధిలో మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహంచారు. ఈ కార్యక్రమానికి గౌరవనీయులైన డివిజనల్ ఫారెస్ట్ అఫీసర్, ఫారెస్ట్ డివిజనల్ అఫీసర్ , ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, నిజామాజాద్ నార్త్ పాటు అటవీ శాఖ సిబ్బంది హాజరయ్యారు. అలాగే మాల్యాపూర్, మల్లారం, గాంధీనగర్, ధర్మారం మరియు చక్రధర్ నగర్ గ్రామాల సర్పంచ్లు కార్యక్రమంలో పాల్గోన్నాదు.జడ్పీ హెచ్ఎస్ మల్లారం మరియు సెయింట్ జేవియర్ స్కూల్, నిజామాబాద్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్వాహంగా పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఉత్వాహంగా మొక్కలు నాటి, పనమహోత్వవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమం ద్వారా హరితపనం పెంపొందించడం, అడవుల పరిరక్షణ, పర్యావరణ పరిరిక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ముఖ్యంగా విద్వార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపాందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత కల్పించారు. వనమహోత్వవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు అటవీ శాఖ సిబ్బందికి అటవీ శాఖ కృతజ్ఞతలు తెలియజేసింది.

## పాంచ జన్య సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ



**నిజామాబాద్, విశాలభారతి :** మండలం జాన్కంపేట్ గ్రామంలో మంగళవారం బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన తెలంగాణ రక్షణ సేన శివాజీ చౌక్ ప్రధాన కూడలి టిఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పా0చ జన్య సంకల్ప సభ పోస్టర్ల ఆవిష్కరణ బోధన్ నియోజకవర్గం ఈనెల 31న తేదీన నిజామాబాదులో నిర్వహించనున్న సభకు టిఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు కలెక్టరేట్ గ్రౌండ్లో పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని. టిఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన ఆ పార్టీ నాయకులు రాష్ట్ర నాయకులు నవీన్ చారి. జిల్లా నాయకులు ఆవంతి రావు. రాచర్ల శేఖర్ రాజు. వారు మాట్లాడుతూ. ఉచిత విద్య. ఉచిత వైద్యం. ఉపాధి. వ్యవసాయం ప్రతి ఒక్కరికి ఎకరం భూమి. సామాజిక న్యాయం.దొంతి ప్రవీణ్ కుమార్. పాలమూరి సాయి నిఖిల్. మండల నాయకులు. సత్యం గౌడ్. జాన్కంపేట్ గ్రామ టిఆర్ఎస్ నాయకులు శాల నరసింహులు. గూడాల పోతన్న. శాల విట్టల్. పురం భాస్కర్. జక్కం చిన్న లింగం. లింగా గౌడ్. వాయిద్. టిఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

## చౌటుప్పల్‌లో పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి

**కె. నాగరాజు విజయం.. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించిన సీఐ మన్మధ కుమార్**



**చౌటుప్పల్, విశాలభారతి:** తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ ఎన్నికలను చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎన్నికల నిర్వహణ అధికారి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించారు. అర్హత కలిగిన పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకుని ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. మొత్తం 32 ఓట్లకు గాను 16 ఓట్లు సాధించిన కె. నాగరాజు (పీసీ 3685) విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కె. నాగరాజు (పీసీ 3685), పి. శ్రీను (పీసీ 4618), వి. శ్రీనివాస్ (హెచ్‌సీ 1843), వి. వీర కృష్ణ (పీసీ 96), వి. ఉపేందర్ (పీసీ 181) అభ్యర్థులుగా పోటీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టిన సీఐ జి. మన్మధ కుమార్‌ను సిబ్బంది అభినందించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కె. నాగరాజును చౌటుప్పల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

**గూడూరు వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**



**విశాలభారతి , గూడూరు:** గూడూరు మండలంలో "తక్కువ నీరు - తక్కువ పెట్టుబడి - స్థిరమైన ఆదాయం" అనే నినాదంతో రైతులకు వ్యవసాయ సాంకేతికత, పంటల వైవిధ్యం మరియు తక్కువ నీటితో సాగు చేసే పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ స్వర్ణ విజయ్ చంద్ర, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ శ్రీనివాసరావు,* వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తక్కువ నీరు - తక్కువ పెట్టుబడి - స్థిరమైన ఆదాయం లక్ష్యంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, సరైన పంటను సరైన సమయంలో ఎంచుకోవడం ద్వారా రైతులు వాతావరణ ప్రతికూలతలను అధిగమించి స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు.

# ఫీజు బకాయిలపై బీజేపీ పోరుబాట

**రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాష్ట్రంలోని దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పోరాటాన్ని ఉధృతం చేసింది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచంద్రరావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు మద్దతుగా రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, యువత తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య కేవలం రాజకీయ అంశం కాదని, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన సమస్య అని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువులు ఆగిపోకుండా ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని, ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఆయన కోరారు. "ఫీజు బకాయి - బీజేపీ లడాయి" నినాదంతో విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# నూతన సంస్థలకు రాంరెడ్డి శుభాకాంక్షలు

**నమ్మకమైన సేవలతో ప్రజల మన్ననలు పొందాలి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మన్సూరాబాద్ డివిజన్‌లో నూతనంగా ప్రారంభమైన సంతు వ్లాగర్స్ వీసా కన్సల్టెన్సీ, తాన్విక్ ఇంటీరియర్స్ అండ్ రియల్ ఎస్టేట్స్ సంస్థల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంస్థల నిర్వాహకుల ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభమైన సంస్థలు ప్రజలకు నాణ్యమైన, విశ్వసనీయమైన సేవలను అందిస్తూ వ్యాపార రంగంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకతతో సేవలందిస్తే సంస్థలు మరింత అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. వీసా కన్సల్టెన్సీ, ఇంటీరియర్స్, రియల్ ఎస్టేట్స్ రంగాల్లో ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తూ సంస్థలు విజయవంతంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. నిర్వాహకులు కృషి, నిబద్ధతతో పనిచేసి మంచి పేరు సంపాదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోచబోయిన సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొని సంస్థల నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. సంస్థల నిర్వాహకులు, సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**గ్రామ సర్పంచ్ నేనావత్ బాలకృష్ణ**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం పరిధిలోని రంగాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ నేనావత్ బాలకృష్ణ నేతృత్వంలో హైదరాబాద్ లోని సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం అనుభవజ్ఞులైన వైద్యులచే 150 మంది కి బ్లడ్ టెస్ట్ ,షుగర్ టెస్ట్ లు చేసి వైద్యుల సూచన మేరకు ఈసీజీ స్కానింగ్, ఎక్స్ రే నిర్వహించి పలు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. గ్రామంలోని పేద మధ్య తరగతి ప్రజలకు ఈ ఉచిత వైద్య శిబిరం చాలా ఉపయోగకరంగా ఉందని, గ్రామ సర్పంచ్ నేనావత్ బాలకృష్ణ, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనిశ్రీ దేవి గైకాలిస్ట్, డాక్టర్ శ్రీరామ్ జనరల్ మెడిసిన్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, ఏఎన్ఎం మోతి , ఆశ వర్కర్ పద్మ, గ్రామ పెద్దలు మల్లేష్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎంటి నాచారం నిర్మాణ పనుల్లో విషాదం

**ఐదో అంతస్తు నుంచి కిందపడి మేస్త్రీ మృతి**

**నాచారం ఆగస్టు 25: విశాల భారతి:** నాచారం హెచ్ఎంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి కిందపడి ఓ మేస్త్రీ మృతి చెందిన ఘటన హెచ్ఎంటి నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం, నెహ్రూ నగర్, మల్లాపూర్‌కు చెందిన అర్పుల బప్పన్న (50) మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత సుమారు 20 సంవత్సరాలుగా రాజేష్ అనే లేబర్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు.మంగళవారం ఉదయం సుమారు 6 గంటలకు బప్పన్న పని నిమిత్తం హెచ్ఎంటీ నగర్, నాచారం వైపు వెళ్లాడు. అనంతరం సుమారు 8:30 గంటలకు, బప్పన్నతో కలిసి పనిచేస్తున్న రాము, బప్పన్న మొబైల్ ఫోన్ నుంచి అతని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, సెంట్రింగ్ పని చేస్తుండగా కిందపడిపోయిడు పిలిచిన స్పందించడం లేదని సమాచారం ఇచ్చాడు.సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా బప్పన్న అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అక్కడి సహచర కార్మికులను పోలీసులు విచారించగా, ఐదో అంతస్తు నుంచి సెంట్రింగ్ బాక్సులను కిందకు దించే సమయంలో ప్రమాదవశాత్తు బప్పన్న కిందపడిపోయి తీవ్ర గాయాల కారణంగా మృతి చెందినట్లు వెల్లడించారు.ఈ ఘటనపై మృతుడి సోదరి అలుక లలిత (54) పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన తమ్ముడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని, ప్రమాదవశాత్తు కిందపడటంతోనే మృతి చెందినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, నిర్మాణ పనుల్లో భద్రతా చర్యలు తదితర అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాము అని హామీ ఇచ్చారు.

# వనమోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్

**పచ్చదనం పెంపే లక్ష్యం - పబ్బత్ బాలకిషన్ గౌడ్**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** వనమోత్సవంలో భాగంగా గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామంలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. వనమోత్సవంలో భాగంగా గ్రామంలో వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్‌రెడ్డి, వార్డు సభ్యులు ఆకిటి రామకృష్ణారెడ్డి, బండారి సత్యనారాయణ, రాపోలు మల్లేష్, పంచాయతీ కార్యదర్శి సునీతతో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.





# నాగోల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎప్పుడు?

- **అనుమతులు లేకుండానే నిర్మాణాల జోరు**
- **టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం**
- **ఫిర్యాదులు చేసినా చర్యలు లేవంటూ ఆరోపణలు**
- **క్షేత్రస్థాయి తనిఖీలకు ప్రజల డిమాండ్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్ సర్కిల్-11లో అక్రమ నిర్మాణాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. నాగోల్ సర్కిల్ లోని పలు ప్రాంతాల్లో సంబంధిత అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా షెడ్లు, ఇతర భవన నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు ప్రారంభించే ముందు సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందడం తప్పనిసరి అయినప్పటికీ కొందరు నిబంధనలను పక్కనపెట్టి నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజలు చెబుతున్నారు. నిర్మాణాలు ప్రారంభమైన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**ఫిర్యాదులపై స్పందన ఏది?**

అనుమతులు లేని నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందిన తర్వాత కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టే వారికి ఒక న్యాయం, నిబంధనలు ఉల్లంఘించే వారికి మరో న్యాయమా? అని ప్రశ్నిస్తున్నారు.

**భవిష్యత్తులో ముప్పు తప్పదా?**

అనుమతులు లేని నిర్మాణాలను నియంత్రించకపోతే భవిష్యత్తులో ట్రాఫిక్, పార్కింగ్, డ్రైనేజీ, రహదారి విస్తరణ వంటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రణాళిక నిబంధనలను కచ్చితంగా అమలు చేసి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

**ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి**

నాగోల్ డివిజన్ తో పాటు కుంట్లూర్, పెద్ద అంబర్‌పేట్ తదితర ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి నిర్మాణానికి అనుమతి ఉందా? అనుమతించిన ప్రణాళిక ప్రకారమే నిర్మాణం జరుగుతోందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

సెక్షన్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే ఎలాంటి మినహాయింపులు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడల్లో శ్రీ విద్యారణ్య విద్యార్థుల మెరుపు

**ఆరు బంగారు పతకాలు సాధించి సత్తా చాటిన విద్యార్థులు**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



బండ్లగూడ జాగీర్ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి 'ఖేల్ ఖూద్' క్రీడా పోటీల్లో శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఆరు బంగారు పతకాలను సాధించారు. బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో లక్షిత రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో చతుర్ విజేతగా నిలిచాడు. వాలీబాల్‌లో ప్రజ్ఞా బృందం, చదరంగం పోటీల్లో ఏకాంక్ష్ బంగారు పతకాలను సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు సాధించిన విజయంతో పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. విజేత విద్యార్థులను అభినందించేందుకు మంగళవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి విశ్వేశ్వరరావు, ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకుంటారని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తూ భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి విజయాలు సాధించేలా పాఠశాల యాజమాన్యం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయులు కార్తీక్, సంజీవ్, నాయక్, చారి, శైలజ తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్: రాష్ట్రస్థాయి అండర్-17 బ్యాడ్మింటన్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థిని లక్షిత రెడ్డి.

# తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ పదవి నుంచి బసవ రాజు శ్రీనివాస్‌ను తొలగించాలి

- **తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తినే చైర్మన్ గా నియమించాలి**
- **వక్తల డిమాండ్**

**ముషీరాబాద్, విశాల భారతి:** తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ పదవి నుంచి సీమాంధ్ర మూలాలు ఉన్న బసవరాజు శ్రీనివాస్ ను తొలగించాలని పలువురు వక్తలు, బ్రాహ్మణ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ అస్థిత్వ పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా సకల జనులను సమన్వయం చేస్తూ తెలంగాణ ఉద్యమం కొనసాగిందని అయినప్పటికి తెలంగాణ ప్రాంత ప్రజలకు వలసదారుల పెత్తనం నేటికి కొనసాగుతుందన్నారు. మంగళవారం ఇందిరా పార్కు వద్ద తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక, తెలంగాణ బ్రాహ్మణ ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా తెలంగాణ గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, తెలంగాణ బేవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, తెలంగాణ గీతా పారిశ్రామిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి తదతరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో సబ్బండ కులాలతో కలిసి పోరాటంలో పాల్గొన్న బ్రాహ్మణ సామాజిక వర్గానికి నేటికి సరైన గుర్తింపు లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ గా సీమాంధ్ర మూలాలు ఉన్న వ్యక్తిని నియమించడం తెలంగాణ ఉద్యమకారులు, బ్రాహ్మణ సమాజాన్ని అవమానించడమే అన్నారు. ప్రజాస్వామ్యంలో అహంకార భావాజాలనికి స్థానంలేదని వారు మండిపడ్డారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో బసవ రాజు శ్రీనివాస్ తన ఉపన్యాసంలో దళిత మహిళలను కించపరుస్తూ మాట్లాడిన మాటలు సభ్య సమాజాన్ని తలదిచ్చుకునేలా ఉన్నాయని వారు అగ్రహం వ్యక్తం చేశారు. బసవరాజు తనపదవికి వెంటనే రాజీనామా చేసి అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి క్షమాపణలు కోరాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన తెలంగాణ ప్రభుత్వం పునరాలోచించి తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ గా తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘాల నేతలు డా. యజ్ఞం పవన్ కుమార్ శర్మ, పోచంపల్లి రమణరావు, గంప రామారావు, వి. ప్రసాద్రావు, ఆకునూరి రమణరావు, గూడా రాజేశ్వరరావు, కిరణ్ పోలం పల్లి రమణ ప్రశాంత్ శర్మ, వేణుగోపాల శర్మతోపాటు బ్రాహ్మణ సంఘాల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఫీజు బకాయిలపై బీజేపీ పోరాటం

**విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరాహార దీక్షకు కళ్లెం నవజీవన్‌రెడ్డి సంఘీభావం**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ చేపడుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.

# నార్సింగి సర్కిల్–45లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం







**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి సర్కిల్-45 పరిధిలోని గిరిగిరి గడ్డ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మూడు అక్రమ భవనాలను మంగళవారం టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కూల్చివేశారు. సంబంధిత నిబంధనల ప్రకారం అధికారుల ఆధ్వర్యంలో ఈ కూల్చివేత చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన అధికారులు, ముందస్తు చర్యల్లో భాగంగా అక్రమ భవనాలను తొలగించారు. అక్రమ నిర్మాణాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టే వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు భవన నిర్మాణాలకు ముందు తప్పనిసరిగా సంబంధిత అనుమతులు పొందాలని అధికారులు సూచించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే భవనాలను తొలగించడంతో పాటు నిబంధనల మేరకు తదుపరి చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే వారిపై కూడా నిఘా ఉంచి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. **డిప్యూటీ కమిషనర్, నర్సింగి సర్కిల్-45,, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

# ఏకతాటిపై గౌడ సంఘం.. ప్రశాంత్ గౌడ్‌కు పగ్గాలు

- **ఆత్మీయ సమ్మేళనంలో ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక**



**విశాల భారతి, ఎల్లారెడ్డి :** మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఐక్యతకు వేదికగా నిలిచింది. మండల గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు సాయ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంగళవారం నూతన కమిటీని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రఘువీర్ గౌడ్, ముఖ్య కార్యదర్శిగా ఉష గౌడ్, సహాయక కార్యదర్శిగా నారా గౌడ్, ముఖ్య సలహాదారుడిగా జగన్ గౌడ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుందన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సంఘ ఐక్యత, గౌడ కుటుంబాల సంక్షేమం, సమష్టి అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ గౌడ్, బాలరాజు గౌడ్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల గౌడ సంఘ సభ్యులు, గౌడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## కాపీ రైట్ వివాదంలో తాప్సీ 'గాంధారి' సినిమా

తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గాంధారి' విడుదలకి ముందే కాపీ వివాదంలో చిక్కుకుంది. కళ్యాణ్ బండి అనే రచయిత ఈ నెట్‌ఫ్లిక్స్ సినిమా కథ తన కథను పోలి ఉందని ఆరోపిస్తూ లీగల్ నోటీసులు పంపడం కలకలం రేపింది. కళ్యాణ్ బండి మీడియాతో మాట్లాడుతూ.. తాను 2019లోనే ఈ కథను రాశానని, నాటి నెట్‌ఫ్లిక్స్ కంటెంట్ హెడ్ మోనికా షెర్గిల్‌కు లింక్డిన్ ద్వారా సంప్రదించి మెయిల్ ద్వారా కథను పంపినట్లు తెలిపారు. మే నెలలో ఆ కథ తమకు సెట్ అవ్వదని చెప్పడంతో తాను వేరే వాళ్లకు పిచ్ చేసుకున్నానని అన్నారు. 2023 చివరి నాటికి ఒక స్టూడియో తన కథతో థియేట్రికల్ ప్రాజెక్ట్ చేయడానికి ముందుకు వచ్చిందని, అయితే 2024 సెప్టెంబర్‌లో కనిక ధిల్లాన్ రైటర్‌గా నెట్‌ఫ్లిక్స్ 'గాంధారి' టైటిల్ అనౌన్స్ చేయడంతో షాక్ గురయ్యానని చెప్పారు.తాప్సీ సినిమాలో కూడా ఒక తల్లి, యువతుల అదృశ్యం అనే పాయింట్ తన కథలాగే ఉండటంతో మోనికాకు మళ్లీ మెసేజ్ చేసినా స్పందన రాలేదని, ఎస్‌డబ్ల్యూఏ (SWA) సూచన మేరకు లీగల్ నోటీసులు పంపినట్లు కళ్యాణ్ వెల్లడించారు. డిసెంబర్ 2024 నాటికి తన నిర్మాతలు కూడా ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నారని తెలిపారు. అయితే ఈ కాపీ రైట్ ఆరోపణలను కనిక ధిల్లాన్ నిర్మాణ సంస్థ 'కథా పిక్చర్స్' పూర్తిగా ఖండించింది. 'గాంధారి' అనేది పూర్తిగా స్వతంత్రంగా అభివృద్ధి చేసిన ఒరిజినల్ కథ అని, దీని కథ, స్క్రీన్‌ప్లే పూర్తిగా కనిక ధిల్లాన్ సొంతమని స్పష్టం చేసింది. ఈ ఆరోపణలు నిరాధారమైనవని, వీటిని నిరూపితమైన నిజాలుగా ప్రచారం చేయవద్దని మీడియాను, ప్రేక్షకులను మేకర్స్ కోరారు. కాగా ఈ చిత్రం సెప్టెంబర్ 3న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.